# మన నేషనలిస్ట్ వాయిస్

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.mananationalistvoice.com epaper.mananationalistvoice.com



రిపోర్టర్లు కావలెను

మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9666023180.8096660656 నంబర్లకు



ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 182 | 30 శనివారం, మే 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం


తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

అయిన ఆచివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం

అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం

మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి

## తడిసిన ధాన్యం సైతం కొని రైతులను

# ఆదుకున్నాం



**హైదరాబాద్, మే29నేషనలిస్ట్ వాయిస్**

దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్...

వివరాలు 2లో

## కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

## 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం

## ప్రధాని మోడీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

**హైదరాబాద్,మే29నేషనలిస్ట్ వాయిస్**

కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ




మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు.




**న్యూఢిల్లీ,మే29నేషనలిస్ట్ వాయిస్**

నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు.

వివరాలు 2లో



## సైబర్ నేరాల అడ్డుకట్టకు చర్యలు

### అధికారులతో సమీక్షలో చంద్రబాబు

**అమరావతి,మే29నేషనలిస్ట్ వాయిస్**

సైబర్ నేరాలపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని.. అందుకోసం సైబర్ పెట్రోలింగ్ జరగాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు పోలీసు శాఖ కార్యచరణపై ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు.

వివరాలు 2లో

## అణగారిన వర్గాల విద్యార్థులకు

# నాణ్యమైన విద్య

గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

ఫేజ్-1లోనే 18,401 సీట్లు భర్తీ

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

### కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం

**హైదరాబాద్,మే29నేషనలిస్ట్ వాయిస్**



రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్‌సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు.

వివరాలు 2లో

## రైతులు సేంద్రియ

# వ్యవసాయం వైపు మారాలి

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం పదిలం

ప్రజలు సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

రైతులు పంట వ్యర్థాలను కాల్చొద్దు: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మే29నేషనలిస్ట్ వాయిస్**



హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆర్గానిక్ మేళా ప్రదర్శన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను సందర్శించి, రైతులతో ముచ్చటించారు.

వివరాలు 2లో



## క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా

# ఇళ్ల డిజైన్

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,మే29నేషనలిస్ట్ వాయిస్**

పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు సౌకర్యవంతమైన, భద్రమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభు త్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల

వివరాలు 2లో

# అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ పాగా

### పంజాబ్ స్థానిక ఎన్నికల్లో ఆప్ విజయభేరి

**ఛండీగఢ్,మే29నేషనలిస్ట్ వాయిస్**

పంజాబ్ లోని అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధించింది. 50 వార్డుల్లో 28 వార్డులు సొంతం చేసుకుంది. దీంతో అబోహర్‌లో బీజేపీ తొలిసారి మేయర్ పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది. 2027లో కీలకమైన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో ఈ గెలుపు బీజేపీలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను శుక్రవారంనాడు ప్రకటించారు. బీజేపీ 28 వార్డులు గెలుచుకోగా, ఆప్ 20 వార్డులతో రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ ఒక స్థానం, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక స్థానం గెలుచుకున్నారు.

వివరాలు 2లో



## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

**హైదరాబాద్,మే29నేషనలిస్ట్ వాయిస్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు.

వివరాలు 2లో

# రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలి

మొదటిపేజీ తరువాయి

సేంద్రియ వ్యవసాయం ప్రాధాన్యత, సాగు విధానాలు, ఎదురవుతున్న సవాళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ÷ూష్ట్రంలో సేంద్రియ వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులు ఆర్గానిక్ సాగు వైపు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాలు రసాయనాల ప్రభావంతో కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుబడుల కోసం అవసరానికి మించి రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగించడం వల్ల నేల సారవంతత దెబ్బతింటోందని తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రసాయనాలతో పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల్లో అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ఇది ఒక కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులు వేగంగా విస్తరిస్తుండటానికి ప్రధాన కారణాల్లో ఆహారపు అలవాట్లు, రసాయనాల ప్రభావం కూడా ఒకటని ఆయన అభిప్రాయపడ్డారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం, ప్రజల ఆరోగ్యం రెండూ మెరుగుపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఉత్పత్తి చేస్తున్న ఆర్గానిక్ ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి వినియోగదారులు నేరుగా ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. ÷–రజలు ఎంత ఎక్కువగా ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే, అంత ఎక్కువగా రైతులు సేంద్రియ సాగు వైపు ఆకర్షితులవుతారని, తద్వారా ఆరోగ్యకరమైన ఆహార వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. రైతులు, వినియోగదారులు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తేనే సమాజానికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అలాగే రైతులు పంట వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా వాటిని సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, ఇది భూమి సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మంత్రి తెలిపారు. రైతులు పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

మొదటిపేజీ తరువాయి

# క్యూర్ పరిధిలో పేదలు సంతృప్తి చెందేలా ఇళ్ల డిజైన్

పట్టణాల్లో జీవించే పేదవాడికి తన జీవనోపాధికి ఇబ్బంది లేకుండా గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి విజన్‌కు అనుగుణంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలోని 24 నియోజక వర్గాల్లో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రూపొందించిన పలు నమూనా డిజైన్లను పరిశీలించి పలు కీలక మార్పులు, సూచనలు చేశారు. రానున్న 40 నుండి 50 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. కేవలం ఇళ్లు కట్టడం మాత్రమే కాదు,భవిష్యత్ తరాలకు అనుకూలంగా ఉండే విధంగా డ్రైనేజీ వ్యవస్థ, పార్కింగ్, వాణిజ్య అవసరాలు, ప్రజల జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైతే 10 అంతస్తుల వరకు భవనాలు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ÷ూల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్‌రూమ్ వంటి విభాగాల పరిమాణాల రూపకల్పనలో వాస్తు అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పేద కుటుంబాలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి డిజైన్ ఉండాలన్నారు. పార్కింగ్‌తో పాటు షాపుల ఏర్పాటుకు కూడా అవకాశం కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, ఆ నియోజకవర్గ ప్రజలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ ఉపాధి, జీవన విధానాలకు దూరం కాకుండా నివాసాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం తుది డిజైన్లను ఖరారు చేసి, యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేలా రోజువారీ కార్యాచరణ రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భద్రత కల్పించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచే అర్బన్ హౌసింగ్ మోడల్‌ను తీసుకొస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు చర్యలు

సైబర్ నేరాల అడ్డుకట్టకు 'ఏపీ సైబర్ గార్డ్' అమలులోకి తీసుకురావాలని ఆదేశించారు. పిల్లర్స్ రెస్పాన్స్ టీమ్స్‌తో ఈ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చునని చెప్పారు. సైబర్ మోసాలపై ఫిర్యాదు అందిన మరుక్షణమే వార్ రూంలో జీరో ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏపీలో సైబర్ నేరానికి పాల్పడితే... తప్పించుకోలేమనే భయం క్రిమినల్స్‌లో రావాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రజలు నష్టపోకుండా సహకరించాలని బ్యాంకు అధికారులకు స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# ఖుష్బూ దంపతుల కుమార్తె అవంతిక వివాహం

**న్యూఢిల్లీ,మే29నేషనలిస్ట్ వాయిస్**

ప్రధాని నరేంద్ర మోదీని సినీ నటి, భాజపా నేత ఖుష్బూ కుటుంబం శుక్రవారం దిల్లీలో కలిసింది. తమ కుమార్తె అవంతిక వివాహానికి ఆహ్వానిస్తూ.. ఖుష్బూ, సుందర్ సి దంపతులు శుభలేఖను అందజేశారు. వారితోపాటు అవంతిక, ఆమెకు కాబోయే భర్త శ్రవణ్ శ్రీనివాసన్ కూడా ఉన్నారు . ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు ఖుష్బూ. ప్రధానితో కలిసి దిగిన ఫొటోను కూడా షేర్ చేశారు. 'బిజీ షెడ్యూల్‌లోనూ ప్రధాని మోదీ మాకు సమయం ఇచ్చినందుకు కృతజ్ఞులం. కాబోయే దంపతులను ఆయన ఆశీర్వదించారు. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. థాంక్యూ మోదీజీ' అని పేర్కొన్నారు. ఖుష్బూ దంపతుల చిన్న కుమార్తె అయిన అవంతిక నటిగా మలయాళంలో ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆరంభం' అనే చిత్రంలో ఆమె యాక్ట్ చేస్తున్నారు. పెద్ద కుమార్తె ఆనందిత నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

# అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య

**హైదరాబాద్,మే29నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్-సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు. సందర్భంగా మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా, అందులో ఓఖఅ గ్రూప్‌కు 21,447, ఃతిఖఅ గ్రూప్‌కు 17,400, ఓఇఅ, అఇఅ, ఊఇఅ గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. ÷ూష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. ఫేజ్-1 అడ్మిషన్లలోనే మొత్తం 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

# మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్?లో పని చేసిన ఆయన 2016 ఏప్రిల్ 29ను హస్తం పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. నాలుగేండ్ల తర్వాత టీడీపీకి రిజైన్ చేసి 2020 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వయోభారం, అనారోగ్య సమస్యతలతో గత కొద్ది రోజులుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

మొదటిపేజీ తరువాయి

# సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

## వారు కూడా మనుషులే అని గుర్తించాలి

## లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి

## సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,మే29నేషనలిస్ట్ వాయిస్**

స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది.

# నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

**న్యూఢిల్లీ,మే29నేషనలిస్ట్ వాయిస్**

నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోడీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు.

# నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది.

# తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం

**హైదరాబాద్,మే29నేషనలిస్ట్ వాయిస్**

దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు.

మొదటిపేజీ తరువాయి

# అబోహార్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ పాగా

కాలిఫోర్నియా ఆఫ్ పంజాబ్'గా అబోహార్‌ను పిలుస్తారు. కిన్నో పండ్ల సాగు, బలమైన వ్యవసాయ ఆదాయం కలిగిన ప్రాంతమిది. ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి కలిగిన అర్బన్ సెంటర్లలో ఇదొకటి. ఈ ప్రాంతంలో ఓటర్ల మనోభావాలను తాజా ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని, 2027 ఎన్నికలకు ముందు ఇలాంటి ఫలితం వెలువడంతో ఆసక్తికరమని విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 20 నగర పంచాయతీలకు మే 26న ఎన్నికలు జరిగాయి. మోహాలి, బటిండా, అబోహార్, బర్నాలా, కపుర్తాలా, మోగా, బటాలా, పఠాన్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల్లో 7.555 మంది పోటీ చేశారు. ఆప్, కాంగ్రెస్, బీజేపీ, సాద్‌తో పాటు బహుజన్ సమాజ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇదిలావుంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇటీవల చేదు అనుభవాలను చవిచూసిన ఆమ్ ఆద్మీ పార్టీ కు ఎట్టకేలకు ఊరట లభించింది. ఆప్ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రమైన పంజాబ్‌లో ఈనెల 26న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు శుక్రవారంనాడు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో ఆప్ ఘనవిజయం సాధించింది. పంజాబ్‌లోని 102 నగర పాలక సంస్థలకు ఈ ఎన్నికలు జరుగగా, వీటిలో 8 మున్సిపాలిటీలు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 19 నగర పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 1,869 వార్డులకు గాను శుక్రవారం రాత్రి వరకు వెలువడిన ఫలితాల్లో 939 వార్డులను ఆప్ కైవసం చేసుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో సగానికి పైగా వార్డులను దక్కించుకుంది. 376 వార్డుల్లో కాంగ్రెస్ గెలిచి రెండో స్థానంలో నిలిచింది. సాద్-189, బీజేపీ-167 స్థానాలు గెలుచుకున్నాయి. బీఎస్పీ 7 వార్డులు దక్కించుకుంది. పంజాబ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఘనవిజయం సాధించడంపై 'ఆప్' నేషనల్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఈడీ పార్టీ తుడిచిపెట్టుకుపోయిందని అన్నారు. పంజాబ్‌లోని చిన్న వ్యాపారులపై ఎన్నో దాడులు చేసి ప్రజలను వేదించిన ఈడీ పార్టీపై ప్రజలు ప్రతీకారం తీర్చుకున్నారని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. భగవంత్ సింగ్ మాన్ సారథ్యంలోని ఆప్ ప్రభుత్వానికి పంజాబ్ ప్రజలు ఇచ్చిన చారిత్రక తీర్పు ఇదని ప్రశంసించారు. భవిష్యత్తులో ఇదే రీతిలో ప్రజలు, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

# సింగరేణి అభివృద్ధికి విశేష సేవలు అందించిన బత్తుల శ్రీనివాసరావు

## -కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు

## -ఉద్యోగ విరమణ పొందనున్న జీఎం (సిఎంసీ)బత్తుల శ్రీనివాసరావుకి ఘన సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం,మే29(నేషనలిస్ట్ వాయిస్):**



సింగరేణికి బత్తుల శ్రీనివాసరావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీన పదవీ విరమణ పొందనున్న సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం(సీఎంసీ) బత్తుల శ్రీనివాసరావుకి శుక్రవారం కార్యాలయంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెమ్ రాజు చేత మర్యాదపూర్వకంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ షాలెమ్ రాజు మాట్లాడుతూ బత్తుల శ్రీనివాసరావు సింగరేణి సంస్థలో 33 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో సమర్థవంతంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. తన విధి నిర్వహణలో నిబద్ధత క్రమశిక్షణ అంకితభావంతో సహచరులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆయనతో తమకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సంస్థకు అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. అనంతరం బత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ పీవీకే--5 ఇంక్లైన్‌లో పనిచేసిన రోజులను స్మరించుకున్నారు. సింగరేణి వంటి ప్రతిష్టాత్మక సంస్థలో సేవలందించడం తనకు గౌరవప్రదమైన అనుభవమని పేర్కొన్నారు. తన సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు సహచరులు కార్మికులు ఉద్యోగులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం అధికారులు ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ అనంతరం ఆయన జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని అందరూ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జీఎం కోటిరెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీబత్స, వీకేసీఎం (సిఎంఓఏఐ) ప్రెసిడెంట్ కొత్తగూడెం ఏరియా ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహరావు, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ఎల్.తిరుపతి, ఎస్ఈ (ఈ అండ్ఎం)అజ్మీర శ్రీనివాస్, ఎస్ఈ నాగభూషణం, (సిఎంఓఏఐ) జనరల్ సెక్రటరీ ఉపేందర్, ఏరియా సెక్యూరిటి అధికారి అభిలాష్, సీనియర్ పీవో ఎం.మురళీ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# భేద భావాలు లేకుండా ఐక్యంగా ముందుకు పోవాలి

## జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్

**భద్రాద్రి కొత్తగూడెం, మే29(నేషనలిస్ట్ వాయిస్):**

విశ్వ వ్యాప్తంగా ఉన్న మానవులంతా కులం మతం వర్ణం వర్గం ప్రాంత బేధభావాలు లేకుండా మీరంతా ఒక్కటేనని హాజ్ చాటి చెబుతుందని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీలోని మస్జిద్ ఎ ఖుబాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులంతా సమానమే అని చాటి చెప్పి ధనం హోదా అందలం అధికార అహంకారం వదిలి మంచి మానవతా విలువలు కలిగి సహనం ప్రేమ త్యాగ గుణాలు పెంపోదించి సమాజంలో శాంతి సామరస్యాలు వెల్లివిరిసేలా చేయాడాని ఇస్లాంలో హజ్ యాత్ర తప్పని సరి చేయడం జరిగిందని అన్నారు. హజ్ యాత్ర ముగించుకొని తిరిగి వచ్చాకా హాజీలు తమ చుట్టూ ఉన్న అసమానతలను దూరం చేస్తూ సమాజంలో మంచిని పెంచి చెడును నిర్మూలించి దైవ భీతి ఆధార సత్ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ మౌలానా మజ్హార్, సోను బాయ్, మదార్ సాహెబ్, తాజుద్దీన్, రఫీ, షబ్బీర్ హుస్సేన్, ఉమర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 29 (నేషనలిస్ట్ వాయిస్):**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట, నమ్నూర్ లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎస్ఆర్ఎం, గాయత్రి రైస్ మిల్లులను సందర్శించి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈసారి ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లను సైతం వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని జై యోగేశ్వర రైస్ మిల్ ను మండల తహశీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి, సిఎంఆర్ ప్రక్రియను పరిశీలించారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, నిర్దేశిత సిఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం,మే29(నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం జూలూరుపాడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గత రాత్రి కురిసిన వర్షాల కారణంగా మొక్కజొన్న నిల్వలు తడిసాయా అనే అంశంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడంతో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కేంద్రంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న నిల్వలను నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో 3,600 మొక్కజొన్న బస్తాలు ఉన్నాయని మొత్తం లోడింగ్ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిన్న ఎన్ని లారీలు లోడింగ్ చేశారో ఇప్పటివరకు ఎంత పరిమాణంలో మొక్కజొన్నను గోదాములకు తరలించారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 28 వేల బస్తాలను గోదాములకు తరలించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, కొనుగోలు కేంద్రం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వినియోగదారుల ఆదరాభిమానాలు చూరగొంటున్న అంజనీపుత్ర

## -ఉత్తర తెలంగాణలో పేరుగాంచిన అంజనీపుత్ర ఎస్టేట్స్

## -సామాజిక బాధ్యతగా సేవ కార్యక్రమాల నిర్వహణ

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 29 (నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల నమ్మకం, అభిమానంతో అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రియల్ ఎస్టేట్ రంగంలో దిగ్గజ సంస్థగా ఎదిగారు. జిల్లాలో అనేక వెంచర్లు ప్రారంభించి, రియల్ ఎస్టేట్ రంగంలో తన ప్రయాణాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. మధ్య తరగతి, ధనిక వర్గాల సొంత ఇంటి కలను నెరవేరుస్తూ, జిల్లాలో అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తనకంటూ ప్రస్థానాన్ని గణనీయంగా కొనసాగిస్తుంది. ఈ క్రమంలో జిల్లాలోని మందమర్రి మండలం వెంకటాపూర్, లేమూరు గ్రామంలో అంజనీపుత్ర యాజమాన్యం అనుబంధ సంస్థ ఎవర ఎస్కేప్స్ పేరుతో నూతనంగా వెంచర్ ను ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో అనేక వెంచర్లను ప్రారంభించి, విజయవంతంగా విక్రయాలు నిర్వహించిన అంజనీ పుత్ర యాజమాన్యం వెంకటాపూర్, లేమూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్ లో సైతం వినియోగదారుల ఆదరాభిమానాలు చూరగొంటుందని అనడం లో ఎలాంటి అతిశయోక్తి లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. వివిధ ప్రాంతాలలో వ్యాపారం కొనసాగిస్తూ, ప్రజల నమ్మకాన్ని, అభిమానాన్ని పొందిన అంజనీ పుత్ర సంస్థ తన సుదీర్ఘ ప్రయాణంలో ఈ నూతన వెంచర్ తో మరో కొత్త మైలు రాయిని సొంతం చేసుకుంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా నమ్మకమైన సంస్థగా జిల్లా తోపాటు ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా అంజనీపుత్ర సంస్థకు బలమైన వినియోగదారుల మద్దతు కలదు. ప్రజల విశ్వాసం, వినియోగదారుల నమ్మకం, డైరెక్టర్ల కృషి ఫలితంగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉత్తర తెలంగాణలో అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రథమ స్థానంలో కొనసాగుతుందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అంజనీ పుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి, ఇతర డైరెక్టర్లు, సిబ్బంది సమిష్టి కృషితో ప్రజల ఆదరాభిమానాలు, వినియోగదారుల నమ్మకంతో పాటు ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకోవడం విశేషం.

**సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాల నిర్వహణ**

అంజనీ పుత్ర సంస్థ రియల్ ఎస్టేట్ రంగం తోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక కర్తవ్యాన్ని నెరవేరుస్తుంది. జిల్లాలో ఏ కార్యక్రమం నిర్వహించిన అంజనీపుత్ర వైపు ప్రజలు చూస్తుంటారు. ఏ కార్యక్రమానికైనా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వివిధ కార్యక్రమాలకు సహాయం అందజేసి, వారి మనుగడను తోడ్పాటు అందిస్తూ, ప్రజల నమ్మకాన్ని, నెరవేరుస్తున్నారు. ఎంతోమంది క్రీడాకారులకు, కళాకారులకు చేయూత నందించడం లో అంజనీపుత్ర యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటు వస్తుంది. అనేక సామాజిక, ఆధ్యాత్మిక, క్రీడ కార్యక్రమాల్లో అంజనీపుత్ర యాజమాన్యం సామాజిక బాధ్యతగా సహాయం అందజేస్తున్నారు. అదే పరంపరను కొనసాగిస్తూ, అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ దిగ్గజ రియల్ ఎస్టేట్స్ సంస్థగా ఉత్తర తెలంగాణ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించి, తనతో పాటు పలువురికి ఉపాధి కల్పించడంతోపాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మరో దిగ్గజ సంస్థగా ఎదుగుతుందని మార్కెట్ వర్గాలు ధీమాగా తెలుపుతున్నాయి.




# ప్రొఫెసర్ నాగేశ్వర్ రావుకు వ్యతిరేకంగా నిరసన

**మందమర్రి, మే 29 (నేషనలిస్ట్ వాయిస్):**

ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని జనసేన పార్టీ నాయకులు ఖండిస్తూ, నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ అడ్ హాక్ కమిటీ సభ్యుడు మాయ రమేష్, జనసేన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడు ఆవుల సాగర్ లు మాట్లాడుతూ, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా నిర్వహిస్తున్న సమావేశాలను ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ మంతెన సంపత్, పార్టీ నాయకులు పిట్టల సుధాకర్, వొడ్నల హరీష్, ఎర్రోజుల సదానందం, మేకల పవన్ కళ్యాణ్, ఐటీ కోఆర్డినేటర్ ముక్తా అవినాష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఐకేపీ వివోఏ లు డిమాండ్లు పరిష్కరించాలి

## వివోఏ ల దీక్షలకు టిడిపి మద్దతు

**మందమర్రి, మే 29 (నేషనలిస్ట్ వాయిస్):**

రాష్ట్ర వ్యాప్తంగా వివోఏ వివోఏ లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, గత నెల రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షలకు తెలుగు దేశం పార్టీ తన సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, వారి డిమాండ్లను పరిష్కరించాలని తెలుగు దేశం పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బి సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వివోఏ ల దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, వారి పోరాటానికి మద్దతు తెలియజేశారు. అనంతరం వివోఏ ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, టిడిపి ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ పి సతీష్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ , రాష్ట్రవ్యాప్తంగా వివోఏ లు గత నెలరోజుల నుండి సమ్మె చేస్తున్న వారి సమస్యలను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. వివోఏ లకు కనీస వేతనం 20 వేల రూపాయలు చెల్లించాలని, వారిని ఎస్ఈఆర్పి ఉద్యోగులుగా గుర్తించి, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వివోఏ లకు సిసి పదోన్నతి కల్పించాలన్నారు. వివోఏ లకు సాధారణ, ఆరోగ్య భీమా సౌకర్యం 20 లక్షల రూపాయల వరకు కల్పించాలని, ట్యాప్ సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా జిఓ నెంబర్ 58 ని సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం తిరుమల, కే తుకారాం, రమాదేవి, వసంత, సరస్వతి, ప్రవంతి, లావణ్య, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్, మహిళా అధ్యక్షురాలు జూపాక సంధ్య, నాయకురాలు భూనేని సుగుణ, కళమ్మ లు పాల్గొన్నారు.





# తూప్రాన్‌లో ఫర్టిలైజర్ దుకాణాలపై డివిజన్ టాస్క్ ఫోర్స్ కమిటీ తనిఖీలు

## నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందించాలని అధికారుల సూచన

**తూప్రాన్, మే 29. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను డివిజన్ టాస్క్ ఫోర్స్ కమిటీ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుతున్నాయా అనే అంశంపై అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు.డివిజన్ టాస్క్ ఫోర్స్ కమిటీలో సభ్యులైన ఆర్డీవో, మండల సీఐ, ఏడీఏ ఆధ్వర్యంలో తూప్రాన్‌లోని ఆగ్రోస్ మరియు రెడ్డి ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన రిజిస్టర్లు, స్టాక్ వివరాలు, క్రయవిక్రయాల నమోదులను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు సకాలంలో అందించాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. రైతులను మోసం చేసే విధంగా వ్యవహరించకుండా పారదర్శకంగా వ్యాపారం నిర్వహించాలని సూచించారు.మండల సీఐ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు లేదా నాసిరకం వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించినట్లయితే సంబంధిత డీలర్లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఏడీఏ మాట్లాడుతూ ప్రతి డీలర్ రోజువారీ క్రయవిక్రయాలను తప్పనిసరిగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, స్టాక్ బోర్డులను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. అధిక ధరలకు విక్రయాలు నిర్వహించినా చర్యలు తప్పవని తెలిపారు.ఈ తనిఖీల కార్యక్రమంలో ఏఈఓలు సంతోష్, సింధు పాల్గొన్నారు.




# మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 29 (నేషనలిస్ట్ వాయిస్):**

మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో మహిళా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండల సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, అధికారులతో కలిసి స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ రుణ సదుపాయాల ద్వారా వివిధ వ్యాపారాలలో మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. బ్యాంకు లింకేజీ, ఎన్ఆర్ఎల్ఎం, ప్యాడీ కమిషన్, పిఎంఎఫ్ఎంఈ పథకాలలో హాజీపూర్ మండలంలో 382 యూనిట్లకు గాను 18 కోట్ల 7 లక్షల రూపాయలు, దండేపల్లి మండలంలో 316 యూనిట్లకు గాను 16 కోట్ల 79 లక్షల రూపాయలు, లక్షెట్టిపేట మండలంలో 512 యూనిట్లకు గాను 18 కోట్ల 23 లక్షల రూపాయలు, మొత్తంగా 1 వేయి 210 స్వయం సహాయక సంఘాలకు 53 కోట్ల 10లక్షల 75 వేల రూపాయలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి ద్వారా లబ్ది పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు, వారు ఆర్జించిన లాభాల నుంచి కొంత శాతం సంఘాల ఖాతాలలో పొదుపు చేయాలని, ప్రతి ఒక్కరికి సమాన లాభం చేకూర్చడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందని, కమిటీ సభ్యులు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని, పిల్లల హాజరు శాతం పెంచాలని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి అవకతవకులకు తావు లేకుండా చూడాలని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా వేగవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం రాష్ట్రంలోని మొదటగా పూర్తయిందని, ఈ అవకాశాన్ని సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, మహిళ స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొంటాం.. రైతుకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## -ధాన్యం తరలింపుకు ప్రత్యేక చర్యలు – లారీల మళ్లింపు

## -రైతులు ఆందోళన చెందొద్దు : గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి





**తూప్రాన్, మే 29. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగనీయ బోమని, చివరి గింజ వరకు ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం తరలింపునకు అవసరమైన లారీలు ఏర్పాటు చేసి, ఐకేపీ కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని గోదాములకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.
శుక్రవారం ఉదయం తూప్రాన్ మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి పరిస్థితిని స్వయంగా పరిశీలించిన ఆయన, నర్సాపూర్ వైపు వెళ్తున్న లారీలను మళ్లించి రైతుల ధాన్యం రవాణాకు వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. ఐకేపీ కేంద్రాల వద్ద వర్షాల కారణంగా ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం రైతులకు భరోసాగా నిలుస్తోందన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడమే లక్ష్యమని తూముకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ధాన్యం తడవకుండా త్వరిత గతిన గోదాములకు తరలించే ప్రక్రియ కొనసాగు తోందని తెలిపారు. రైతులు ఎవరూ దళారులను ఆశ్రయించవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయించాలని సూచించారు.రైతులు రోడ్లపై పడిగాపులు కాచే పరిస్థితి రాకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని, కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పడిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు కొనసాగు తున్నాయని చెప్పారు. వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో రవాణా ఇబ్బందులు తలెత్తినా, అన్ని శాఖల సమన్వయంతో వాటిని అధిగమిస్తున్నామని వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ ప్రేమ్ కుమార్, నవీన్, డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ వెంకటరాజు గౌడ్, ఎస్ఐ గంగరాజు, పోలీసు సిబ్బంది, సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి, నెముటూరు రంగారెడ్డి, తూప్రాన్ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు, నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, నాయకులు విఠల్ రెడ్డి, రామునిగారి చిన్న నాగరాజు గౌడ్, శ్రీశైలం గౌడ్, జింక మల్లేష్, యావాపూర్ సర్పంచ్ యాంజాల స్వామి, ధాతర్పల్లి సర్పంచ్ జయరాములు, ఇస్లాంపూర్ సర్పంచ్ సంతోష్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మామిండ్ల కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన డీలర్లతో ఏవో సమావేశం – కీలక సూచనలు

**ఏర్గట్ల, మే 29, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి**

ఏర్గట్ల,: ఖరీఫ్ సాగు ప్రారంభం నేపథ్యంలో ఏర్గట్ల మండలంలోని విత్తన మరియు పురుగుమందుల డీలర్లతో మండల వ్యవసాయ అధికారి వైష్ణవ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రానున్న సాగు సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన డీలర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి వైష్ణవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం సిఫార్సు చేసిన వరి రకాలను రైతులకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. విత్తనాల కొనుగోలులో పారదర్శకత ఉండాలని, ప్రతి రైతుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాల్సిందేనని ఆదేశించారు. ఒకవేళ విత్తనాల నాణ్యత లేదా ధరల విషయంలో రైతుల నుండి ఏవైనా ఫిర్యాదులు వస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.?అనధికారిక అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. రైతులు కేవలం లైసెన్స్ కలిగిన విత్తన వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, లైసెన్స్ లేని వ్యక్తులు ఎవరైనా విత్తనాలను విక్రయిస్తే వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదు అడగాలని ఆయన సూచించారు.



# మహిళా సంఘాల సభ్యులను కోటీశ్వరాల్లుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయం

## మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్

(కుల్కచర్ల : నేషనలిస్ట్ వాయిస్ : మే 30)

99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కోటి మంది మహిళా సంఘాల సభ్యులను కోటీశ్వరాల్లుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో రూ.2 కోట్ల 80 లక్షల విలువ గల చెక్కును సంఘ లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పరిగి శాసనసభ్యులు డాక్టర్ రామ్మోహన్ రెడ్డి నిరంతర కృషి తో మహిళలు స్వయంకృషితో ఎదిగి ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడడమే కాకుండా తమ కుటుంబాలను కూడా ఆర్థికంగా ఆదుకునే స్థాయికి ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ నాయక్, మండల పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్,స్థానిక సర్పంచ్ వార్వాల అంజిలయ్య, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి మరియు వివిధ గ్రామాల మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నిధులతో బోర్

గండీడ్ నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ మే 29

మన్సూర్పల్లి తండా వాటర్ ప్రాబ్లం వుంది అని అడిగిన వెంటనే ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నిధులతో బోర్ వేయించడం జరిగింది రెండు ఇంచుల నీలు పడడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్ మండల అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, బిజెపి నాయకులు చాకలి బాలయ్య,శివకుమార్,రాఘవేందర్, గోపాల్, మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగిందితదితరులు పాల్గొన్నారు



# విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 29 (నేషనలిస్ట్ వాయిస్)

విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. విద్యుత్తు శాఖ అధికారులతో స్థానిక కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా వడగాల్పుల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగే విధంగా విద్యుత్ అధికారుల పనితీరు ఉండాలన్నారు. ఏ ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని సూచించారు. వృద్ధులు, పిల్లలు, వివిధ రకాల వ్యాధులతో బాధపడేవారు విద్యుత్ అంతరాయం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. మరోవైపు ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు కూలటం, తీగలు తెగిపడటం వల్ల విద్యుత్తు సరఫరాలో ఏర్పడే సమస్యలను వీలయినంత వేగంగా పరిష్కరించి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. లో వోల్టేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు. ట్రాన్స్ఫార్మర్లు పూర్తి సామర్థ్యంతో పని చేసే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్తు సరఫరా అనేది అత్యవసర సేవల విభాగంలో ఉందని, పైనుంచి కింది స్థాయి వరకు విద్యుత్ శాఖ సిబ్బంది ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ నరసింహమూర్తి, పట్టణం, రూరల్ ఏడిలు రవిశంకర్, రామకృష్ణ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.



# వేగవరంలో డ్రోన్ 'మెరుపు' దాడి

## - పేకాట శిబిరం ధ్వంసం: 8 మంది అరెస్ట్.. ₹20,370 నగదు, 5 బైక్‌లు సీజ్!

## - పేకాట రాయుళ్ల ఆటకట్టించిన జంగారెడ్డిగూడెం పోలీసులు!







జంగారెడ్డిగూడెం, మే 29:(నేషనలిస్ట్ వాయిస్)

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పోలీసులు సరికొత్త వ్యూహాలతో విరుచుకుపడుతున్నారు. సబ్ డివిజన్ పరిధిలో చట్టవ్యతిరేక శక్తుల ఆటకట్టించడానికి ఆధునిక సాంకేతికతను జోడించి, డ్రోన్ కెమెరాల నిఘాను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామ పంచాయతీ పరిధిలో పోలీసులు నిర్వహించిన మెరుపు దాడిలో ఒక పేకాట శిబిరం గుట్టు రట్టయింది.పోలీసుల కథనం ప్రకారం... వేగవరం గ్రామంలోని బీసీ కాలనీ శివారున గల నిర్మానుష్యమైన ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు నమ్మకమైన సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ వీరప్రసాద్, తమ సిబ్బందితో కలిసి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. నిందితులు ముందే అప్రమత్తమై పారిపోకుండా ఉండేందుకు, తొలుత డ్రోన్ కెమెరా సహాయంతో గగన తలం నుండి సదరు ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. డ్రోన్ విజువల్స్ ఆధారంగా పేకాట స్థావరాన్ని ఖచ్చితంగా గుర్తించిన ఎస్ఐ మరియు సిబ్బంది ఒక్కసారిగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన 8 మంది వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఎనిమిది మంది నిందితుల వద్ద నుండి పోలీసులు ₹20,370/- (ఇరవై వేల మూడు వందల డెబ్బై రూపాయలు) నగదుతో పాటు, వారు వాడిన 5 మోటార్ సైకిళ్లను (బైక్‌లు) స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుబడిన ఎనిమిది మందిపై జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో జూద నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.అలాగే "మండల పరిధిలో జూదం (పేకాట), గంజాయి రవాణా, నాటుసారా తయారీ వంటి ఎలాంటి అసాంఘిక, చట్ట విరుద్ధమైన కార్య కలాపాలు నిర్వహించినా సహించేది లేదని,లోతట్టు, మారుమూల ప్రాంతాలపై నిరంతరం డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించి చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం." అని సబ్ ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్ తెలిపారు.

# ఎన్టీఆర్ అవార్డు ప్రధానోత్సవానికి జిల్లా న్యాయవాది సుధీర్ కుమార్ సంగెంకు ప్రత్యేక ఆహ్వానం







ఆదిలాబాద్ జిల్లా మే 29 (నేషనలిస్ట్ వాయిస్)

జిల్లాలో సామాజిక కార్యకర్తగా, న్యాయవాదిగా విశేష గుర్తింపు పొందిన అడ్వకేట్ సుధీర్ కుమార్ సంగెంకు ప్రతిష్ఠాత్మక ఎన్టీఆర్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా పాల్గొనేందుకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి సంవత్సరం స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారి స్మారకార్థం సామాజిక కార్యకర్తలు, సినీ ప్రముఖులు, అలాగే వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులకు ఎన్టీఆర్ అవార్డులను ప్రదానం చేస్తారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు సత్య సంగీత ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రధానోత్సవం నిర్వహించబడుతోంది.

ఈ నెల 29న హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక వేదిక శ్రీ త్యాగరాయ గాన సభలో ఈ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ వేడుకకు తెలంగాణ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, మాజీ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ శ్రీ మధుసూదనాచారి, మాజీ తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ శ్రీ వకుళాభరణం కృష్ణమోహన్, సినీ నటీమణులు రాధిక, సుప్రియ, గీతాంజలి, సత్య సంగీత ఇంటర్నేషనల్ అధ్యక్షుడు శ్రీ ఓంకార్ రాజు తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

వారి సమక్షంలో అడ్వకేట్ సుధీర్ కుమార్ సంగెం అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని అవార్డుల ప్రదానంలో భాగస్వామ్యం కానుండటం జిల్లాకు గర్వకారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఈ అరుదైన అవకాశం తనకు లభించడం పూర్వజన్మ సుకృతమని అడ్వకేట్ సుధీర్ కుమార్ సంగెం ఆనందం వ్యక్తం చేశారు.



# పెదతాడేపల్లి గురుకులం విద్యార్థి మనోజ్ ను అభినందించిన మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 29 (నేషనలిస్ట్ వాయిస్)



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి పి.మనోజ్ కుమార్ ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు గాను 574 మార్కులు సాధించాడు. పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభను కన బరచటంతో పాటు గురుకుల పాఠశాల పేరుప్రఖ్యాతలను రాష్ట్ర స్థాయిలో నిలబెట్టిన మనోజ్ కుమార్ ను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ప్రధాన కార్యదర్శి నాయక్, కార్యదర్శి ప్రసన్న.వెంకటేష్, సామాజిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి, సంయుక్త కార్యదర్శి రూపావతి, డిసిఓ ఎన్.భారతి శుక్రవారం ప్రత్యేక అభినందనలు తెలియ జేయటం తోపాటు ఘనంగా సత్కరించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి గురుకుల విద్యార్థి మనోజ్ కుమార్ కు ప్రసంసాపత్రాన్ని అందజేశారు. విద్యార్థితో పాటు ఇంతటి విజయానికి కారణమైన అధ్యాపకుల సేవలను, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు కృషి అభినంద నీయమని ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్తులోనూ ఇదేరీతిన అద్భుత ప్రతిభను కనబరచటంతో పాటు అత్యధిక మార్కులు సాధించేలా ఉన్నతంగా తీర్చిదిద్దాలని వివరించారు.

# చినుకు పడితే నరకం.. రోడ్లపైనే మురుగు నీరు





ఏలూరు వినాయక నగర్ 5వ డివిజన్ ప్రాంతంలో కనీస డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో, చిన్నపాటి చినుకు పడితే చాలు డ్రైనేజీ నీరంతా రోడ్ల మీదకు చేరుతోంది. మురుగునీరు చెరువులను తలపిస్తూ రోడ్లపైనే నిలిచిపోతుండటంతో, ఆ దారి గుండా వెళ్లడానికి స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అపరిశుభ్ర వాతావరణం వల్ల అంటువ్యాధులు ప్రబలి తమ ఆరోగ్యం ఎక్కడ పాడవుతుందోనని వినాయక నగర్ ప్రజలు బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. తాత్కాలిక పనులతో చేతులు దులుపుకుంటున్న అధికారులుఈ సమస్యపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వచ్చి ఏదో తాత్కాలికంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ధ్వజమెత్తుతున్నారు. ఈ నరకయాతన నుండి తమకు విముక్తి కల్పించాలని కోరుతూ వినాయక నగర్ వాసులు నగరపాలక సంస్థ అధికారుల ముందు రెండు ప్రధాన డిమాండ్లను ఉంచారు: 1) శాశ్వత డ్రైనేజీ నిర్మాణం: వాటర్ ట్యాంక్ రోడ్డులో మురుగునీరు సజావుగా సాగిపోయేలా తక్షణమే శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలి. 2) నూతన సీసీ రోడ్ల నిర్మాణం: పూర్తిగా పల్లమైపోయి, గుంతలమయంగా మారిన పాత రోడ్ల స్థానంలో నూతన సీసీ రోడ్లను వేయాలి. ఇప్పటికైనా స్పందించి, తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వినాయక నగర్ 5వ డివిజన్ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

## - తహశీల్దార్ తోట సాయిబాబా ఆర్థిక సాయం

## - పాల్గొన్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ హరి, వీఆర్వో ఫణి





**టి. నర్సాపురం, మే 29:(నేషనలిస్ట్ వాయిస్)**

కనుచూపు మేర ఎండలు మండి పోతున్న వేళ, ఉపాధి హామీ కూలీల దాహార్తిని తీర్చేందుకు ఏలూరు జిల్లా టీ.నర్సాపురం తహశీల్దార్ తోట సాయిబాబా మానవత్వాన్ని చాటు కున్నారు. ఆయన సొంత ఆర్థిక సహాయంతో మండలంలోని నందమూరి విజయసాగర్ ప్రాజెక్టు, సాకిరేవు చెరువు వద్ద పనిచేస్తున్న సుమారు 350 మంది ఉపాధి హామీ కూలీలు, పారిశుధ్య కార్మికులకు శు క్రవారం చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ బండ్రెడ్డి హరి ముఖ్య అతిథిగా, వీఆర్వో ఫణి విశిష్ట అతిథిగా హాజరై కూలీలకు మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "చినుకు చినుకు చేరితే చెరువు నిండుతుంది, మొక్కకు మొక్క నాటితే వనం పెరుగుతుంది" అని పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. తీవ్రమైన ఎండల్లో తమ గురించి ఆలోచించి మజ్జిగ పంపిణీ చేసిన తహశీల్దార్ ఔదార్యానికి ఉపాధి హామీ కూలీలు, సామాజిక కార్యకర్తలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే తాటిగడప జయరాజు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు యస్.డి. నాసర్ పాషా, కొరివి శేషారావు, పింగుల మధు, ఫీల్డ్ అసిస్టెంట్ బైగాని చందు, వీఆర్ఏ షేక్ రహీం, మారుమూళ్ల రామస్వామి, మాదంశెట్టి ప్రభాకర్, రొక్కం రమేష్, రాణి, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

# జీనియస్ వరల్డ్ రికార్డులో కుక్కునూరు బాలుడు!

## - ఏకకాల పియానో ప్రదర్శనలో మెరిసిన శెట్టి మోక్షిత్

## - గచ్చిబౌలిలో ప్రతిభా పత్రం అందజేసిన ఇంటర్నేషనల్ మ్యూజిక్ స్కూల్ అధినేత



**కుక్కునూరు, మే 29:(నేషనలిస్ట్ వాయిస్)**

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం లోని వెంకటాపురం గ్రామానికి చెందిన శెట్టి మోక్షిత్ రిషి నిహార్ అరుదైన ప్రతిభను చాటుతూ 'జీనియస్ వరల్డ్ రికార్డ్'లో చోటు సంపాదించాడు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువు తున్న మోక్షిత్, సంగీత రంగంలో తనదైన ప్రత్యేక శైలిని అనుసరిస్తూ ఈ అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నాడు. గ్రామానికి చెందిన జర్నలిస్ట్ గోపి - మేరీ దంపతుల ద్వితీయ కుమారుడైన మోక్షిత్ సాధిం చిన ఈ విజయం స్థానికంగా హర్షం వ్యక్తం అవుతోంది. గత ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఒక భారీ ఏకకాల పియానో సంగీత ప్రదర్శనలో మోక్షిత్ పాల్గొన్నాడు. వివిధ దేశాలకు చెందిన సుమారు 2,000 మంది సంగీత కళాకారులు ఏకకాలంలో పాల్గొన్న ఈ బృహత్తర కార్యక్రమం ప్రపంచ రికార్డుగా నమోదైంది. ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శనలో మోక్షిత్ అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్ గచ్చిబౌలిలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మోక్షిత్ ఈ వరల్డ్ రికార్డ్ ప్రతిభా పత్రాన్ని అందుకున్నాడు. ఇంటర్నేషనల్ మ్యూజిక్ స్కూల్ అధినేత అగస్టీన్ దండంగి చేతుల మీదుగా మోక్షిత్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. కాగా, ఈ బాలుడు గత ఏడాది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ చోటు సంపాదించడం విశేషం. ఇప్పటికే పలు అంతర్జాతీయ రికార్డులను తన ఖాతాలో వేసుకుని మోక్షిత్ దూసుకుపోతున్నాడు. చిన్న వయసులోనే అసాధారణమైన సంగీత ప్రతిభతో రాణిస్తున్న మోక్షిత్ రిషి నిహార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు అభినంది ంచారు. భవిష్యత్తులో మోక్షిత్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, దేశవ్యాప్తంగా గొప్ప పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు.

# దేవరకద్ర మండలంలో ప్రీ ప్రైమరీ పాఠశాలల ఎంపిక..

## - మండల విద్యాధికారి పి బలరాం

**దేవరకద్ర 29 నేషనలిస్ట్ వాయిస్**



దేవరకద్ర మండలంలోని ఐదు పాఠశాల లు ప్రీ ప్రైమరీ విద్యకు ఎంపికయ్యాయి 2026 27 విద్యా సంవత్సరానికి గాను యుపిఎస్ వెంకటయ పల్లి, యుపిఎస్ జీనుగురాల ,ఎంపీపీ ఎస్ దేవరకద్ర ఎంఆర్సి, పిఎస్ నార్లోని కుంట్ల, పిఎస్ డోకూరు, పాఠశాలలు ఎంపికైనవి అని ఎంఈఓ పి బలరాం, శుక్రవారం ఓ ప్రకటనలు తెలిపారు. చిన్నారులకు ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్య, ఆటలతో అభ్యాసం, భాష నైపుణ్యాలు అందించడమే లక్ష్యం అని అన్నారు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని తెలిపారు ప్రభుత్వము విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా సేవలను వినియోగించుకోవాలని ఎంఈఓ సూచించారు.




# సర్ ప్రక్రియపై జగన్ విషం చిమ్ముతున్నారు

## - దొంగ ఓట్లు తొలగించడం జగన్ కి ఇష్టం లేదు

## - నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం

**బాపట్ల : మే 29 ( నేషనలిస్ట్ వాయిస్ )**




ఆంధ్రప్రదేశ్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జూన్ 15 2026 నుండి సెప్టెంబర్ 22 లోగా పూర్తి అవుతుంది అని,2026 అక్టోబర్ 1న తుది జాబితా వస్తుంది అని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం శుక్రవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో మొత్తం 4,16,16,061 ఓట్లు మే 12 నాటికి ఉన్నాయని,బీ ఎల్ ఓ లు 46,397 మందిని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమించిందని,రాజకీయ పార్టీలు కూడా 68,868 మందిని బీ ఎల్ ఏ లుగా నియమించుకున్నాయని తెలిపారు.ఇటీవల మాజీ ముఖ్యమంత్రి జగన్ రాజ్యాంగ బద్ధంగా,పారదర్శకంగా జరుగుతున్న సర్ గురించి తప్పుగా మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు.పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ,తమిళనాడులో స్టాలిన్ ఓటమికి సర్ కారణమని చెప్పడం సరికాదని అన్నారు.దొంగ ఓట్లు తొలగిస్తే జగన్ ఎందుకు భయపడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.సర్ జరిగితే వైఎస్ఆర్సీపీకి వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావని జగన్ కి భయం పట్టుకుందని అన్నారు.ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణని నవతరం పార్టీ నుండి స్వాగతిస్తున్నమన్నారు.సుప్రీం కోర్టు కూడా సర్ జరపాలని ఆదేశించిన విషయం జగన్ గుర్తించి సర్ కి సహకరించాలని డిమాండ్ చేస్తున్నామని రావు సుబ్రహ్మణ్యం తెలిపారు.

# బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు పోచ్చర నాయకుల ఘన సన్మానం

**ఆదిలాబాద్ జిల్లా మే 29 (నేషనలిస్ట్ వాయిస్)**

బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను పోచ్చర నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోచ్చర నాయకులు చైర్మన్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో బోథ్ మండల యూత్ కాంగ్రెస్ కార్యదర్శి చెమ్మేన లక్ష్మణ్ పాల్గొని, మార్కెట్ కమిటీ అభివృద్ధికి చైర్మన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. అలాగే ప్రభాకర్ మరియు శేమేందర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, మార్కెట్ సదుపాయాల మెరుగుదల కోసం చైర్మన్ మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు సేవలను కొనసాగిస్తానని చైర్మన్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పెనుగంగలో పడి బాలుడు మృతి

**ఆదిలాబాద్,మే29 (నేషనలిస్ట్ వాయిస్)**

ఆదిలాబాద్ జిల్లాలోని బేల మండల కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. గంగమ్మ తల్లికి బోనం సమర్పించుకునేందుకు తన నానమ్మ బంధువులతో మండలంలోని సాంగిడి గ్రామ పెనుగంగ వద్దకు శుక్రవారం బోనం సమర్పించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో బెతం సాయిదీప్ (14) బాలుడు పెనుగంగా వాగులో స్నానం చేస్తూ నానమ్మ, బంధువులు చూస్తుండగానే నీటి గుంతలోకి జారుకున్నాడు. దీంతో బాలుడిని కాపాడేలోపే మునిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెనుగంగా వద్దకు చేరుకొని బాలుడు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

# భక్తి శ్రద్ధలతో మాలిక్ బాబా మలీదా ఉత్సవం

## - 65 ఏళ్లుగా కొనసాగుతున్న విశిష్ట సంప్రదాయం

## మొక్కులు తీర్చే దైవంగా భక్తుల విశ్వాసం





**ఆదిలాబాద్ జిల్లా మే 29 (నేషనలిస్ట్ వాయిస్)**

ఆదిలాబాద్ జిల్లా హత్నూర్ మండలం లోని వర్తమాన్నూర్ గ్రామంలో బాబా మాలిక్ సబ్ దస్తగిరి బాబా దేవాలయంలో నిర్వహించే మలీదా ఉత్సవం గత 65 సంవత్సరాలుగా భక్తి శ్రద్ధలతో కొనసాగుతోంది. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ ఉత్సవం ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించబడుతోంది.

గ్రామ పెద్దల కథనం ప్రకారం, గతంలో గ్రామంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో బాబా మాలిక్ సబ్ దర్గాలో మలీదా సమర్పించి ప్రార్థనలు నిర్వహించేవారు. ఆ తరువాత వర్షాలు కురవడం ప్రారంభమయ్యేదని స్థానికులు విశ్వసిస్తున్నారు. అప్పటి నుంచి ఈ సంప్రదాయం గ్రామంలో ఆచారంగా మారి తరతరాలుగా కొనసాగుతోంది.

ఉత్సవం సందర్భంగా గ్రామస్తులు ఉదయం నుంచే నియమ నిష్ఠలతో ఉండి, ఒక్కపూట భోజనం చేసి, పిండివంటలు, నెయ్యి, బెల్లంతో ప్రత్యేకంగా తయారు చేసిన మలీదా ప్రసాదాన్ని బాబా మాలిక్ సబ్‌కు సమర్పిస్తారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకుంటారు.

భక్తుల విశ్వాసం ప్రకారం, బాబా మాలిక్ సబ్ ఆశీస్సులతో ఎన్నో కోరికలు నెరవేరాయని, జీవితంలో సుఖసంతోషాలు కలిగాయని చెబుతున్నారు. అందుకే ప్రతి ఏడాది సమీప గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

ఈ ఏడాది కూడా గ్రామ ప్రజలు సంప్రదాయబద్ధంగా మలీదా ఉత్సవాన్ని నిర్వహించి, భక్తి భావంతో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, సామరస్యానికి ప్రతీకగా ఈ ఉత్సవం నిలుస్తోందని స్థానికులు పేర్కొన్నారు.

# యువనేత నారా లోకేష్‌ను కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రవి కొండపల్లి

**అమరావతి:మే 29(నేషనలిస్ట్ వాయిస్)**

మహానాడు ముగింపు వేడుకల అనంతరం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, ఐటీ శాఖామాత్యులు నారా లోకేష్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి కొండపల్లి గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రవి కొండపల్లి మాట్లాడుతూ.. రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా 'యువగళం' పాదయాత్ర ద్వారా ప్రజల్లో నూతన ఉత్తేజాన్ని నింపిన అసాధారణ రథసారథి నారా లోకేష్ అని కొనియాడారు. నాడు కష్టకాలంలో 'నేనున్నాను' అంటూ ముందుకు కదిలి, నేడు అశేష ప్రజాభిమానాన్ని చూరగొని నిజమైన ప్రజానాయకుడిగా ఎదిగారని ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, సరికొత్త పరిశ్రమలు తీసుకురావడంలో లోకేష్ విశేష కృషి చేస్తున్నారని.. ఆయన ఆలోచనా విధానం కేవలం ఏపీకే కాకుండా దేశానికే ఒక దిక్సూచిలా మారిందని పేర్కొన్నారు. యువత కలలను నిజం చేస్తూ, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల ఆశలకు ఊపిరి పోస్తూ.. రాబోయే నాలుగు దశాబ్దాల పాటు పార్టీకి తానున్నాననే బలమైన భరోసాను ఇస్తున్న భవిష్యత్తు నాయకుడు నారా లోకేష్ అని రవి కొండపల్లి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మున్సిపల్ చైర్మన్ దమయంత.. లేక గోవర్ధన్ రెడ్డి..?

## - అభివృద్ధిలో అందర్నీ కలుపుకొని పోవాలి..

## - మున్సిపల్ కౌన్సిలర్

**దేవరకద్ర మే 29 నేషనలిస్ట్ వాయిస్**



దేవరకద్రమున్సిపాలిటీ చైర్మన్ బిసి అభ్యర్థి అయిన దమయంత లేక ఓసి అభ్యర్థి అయిన గోవర్ధన్ రెడ్డి అని మున్సిపల్ కౌన్సిలర్లు మాధవి, రాధా, పాండు, ఆరోపించారు. దేవరకద్ర మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీ నూతనంగా ఏర్పడిన దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని రెడ్డిల రాజ్యం నడుస్తుందని కౌన్సిలర్ ఆరోపించారు. గ్రామంలో ప్రతి పనికి కౌన్సిలర్ కు సమాచార ఇవ్వకుండానే వారి ఇష్టమొచ్చినట్లు చేస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. అధికారులు కూడా కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా చైర్మన్ ఇష్టం వచ్చినట్లుగా వ్యవరిస్తున్నారని వారు తెలిపారు. కౌన్సిలర్లకు ఎటువంటి సమాచారం లేకుండా గ్రామాలలో అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో కోషన్ ఎన్నిక ఉన్న కూడా తమకు తప్పుడు సమాచారం ఇవ్వడం జరిగింది ఎన్నికకు ముగ్గురు టీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు బహిష్కరణ చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షుడు, బాలరాజ్ మాజీ మార్కెట్ చైర్మన్ దొబ్బలి ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి ఉప్పల వెంకట రాములు. మాజీ మూడ సభ్యుడు కర్ణం రాజు. చౌదర్పల్లి మాజీ సర్పంచ్ యుగంధర్ రెడ్డి, అడ్డు, సిరాజ్, కొండల్, కురుమూర్తి, రాము, తదితరులు పాల్గొన్నారు.

# బొర్రంపాలెంలో వీధి దీపాల పునరుద్ధరణ స్పందించిన పంచాయతీ కార్యదర్శి

**టీ. నర్సాపురం, మే 29 (నేషనలిస్ట్ వాయిస్):**

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామంలోని పలు వీధుల్లో గత నెల రోజులుగా నెలకొన్న చీకట్లు త్వరలోనే తొలగిపోనున్నాయి. గ్రామంలోని సూరంపూడి మాస్టర్ (వెంకటరత్నం) వీధి (హైస్కూల్ బజారు), బాబురావు ఇంటి వద్ద, చావా వీరరాఘవులు ఇంటి వద్ద, మరియు వీరభద్రవరం వెళ్ళే దారిలో ఉన్న జగనన్న కాలనీలో గత ముప్పై రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఈ చీకట్ల సమస్యపై స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కొందరు స్థానికులు సామాజిక వేత్త గుండె పాండురంగ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన తక్షణమే స్పందించి, సమస్య పరిష్కారం కోసం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) నందు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే బొర్రంపాలెం పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ సానుకూలంగా స్పందించారు. ఈ తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా, ఆయన వెంటనే పంచాయతీ సిబ్బందిని రంగంలోకి దించి వీధి దీపాల పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. రాబోయే రెండు రోజుల్లో గ్రామంలో వీధి దీపాలు వెలగని అన్ని ప్రాంతాల్లోనూ కొత్త లైట్లు అమర్చి, సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని కార్యదర్శి హరికృష్ణ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తీవ్రమైన మండుటెండలను సైతం లెక్కచేయకుండా, ప్రజల ఇబ్బందులను గమనించి తక్షణమే స్పందించి పనులు ప్రారంభించిన పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ కి మరియు వారి సిబ్బందికి సామాజిక వేత్త గుండె పాండురంగ స్థానిక ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.






# బీరప్ప స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**దేవరకద్ర మే 29 నేషనలిస్ట్ వాయిస్**

మండల కేంద్రంలో శుక్రవారం కరిసెల బీరప్ప స్వామి ఎల్లమ్మ తల్లి బండారు ఉత్సవాల్లో లో స్థానిక ఎమ్మెల్యే జి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# టీ.నరసాపురం మండలంలో మహానాడు గ్రాండ్ సక్సెస్

## - కార్యకర్తల ఉత్సాహమే తెలుగుదేశం పార్టీకి కొండంత బలం

## - మాజీ జెడ్పీటీసీ శీలం వెంకటేశ్వరరావు

**టీ.నరసాపురం మే 29(నేషనలిస్ట్ వాయిస్)**



మహానాడు కార్యక్రమం అంటేనే తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఆత్మగౌరవ సభ అని మరోసారి నిరూపితమైందని మాజీ ఎంపీపీ, జడ్పీటీసి,( పి ఎ సి ఎస్) చైర్మన్ శీలం వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. పోలవరం నియోజకవర్గం, టీ.నరసాపురం మండలంలో మహానాడు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, పండుగ వాతావరణంలో నిర్వహించి గ్రాండ్ సక్సెస్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుండి క్లస్టర్ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని మహానాడును విజయవంతం చేశారని కొనియాడారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించిన ప్రతి తెలుగు తమ్ముడికి, పార్టీ శ్రేణులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యకర్తల మధ్య ఉన్న ఐక్యత, వారిలో కనిపించిన అపారమైన ఉత్సాహమే తెలుగుదేశం పార్టీకి కొండంత బలమని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. పోలవరం నియోజకవర్గ పరిధిలోని టీ.నరసాపురం మండలంలో పార్టీ పిలుపును అందుకుని, మహానాడు కార్యక్రమానికి తరలివచ్చి జయప్రదం చేసిన తెలుగుదేశం కుటుంబ సభ్యులందరికీ, నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు శీలం వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# మాజీ మంత్రి,బాపట్ల మాజీ శాసనసభ్యులు గాదె వెంకట రెడ్డి కన్నుమూత

**బాపట్ల : మే 29 (నేషనలిస్ట్ వాయిస్)**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, బాపట్ల మాజీ శాసనసభ్యులు గాదె వెంకట రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు.ఆయన ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం నుంచి 3 సార్లు,ఉమ్మడి గుంటూరు జిల్లా బాపట్ల నియోజకవర్గం నుంచి 2 సార్లు శాసనసభ్యులుగా గెలుపొందారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి,వై,ఎస్.రాజశేఖరరెడ్డి,కొణిజేటి రోశయ్య మంత్రివర్గాల్లో మంత్రిగా సేవలందించారు.ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు.

# నందిగామ పట్టణ సీఐ శ్రీనును మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు

**నందిగామ, మే 29 (నేషనలిస్ట్ వాయిస్):**

నందిగామ పట్టణ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పి. శ్రీనును ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ నాయకులు యర్రబడి సురేష్, ప్రముఖ న్యాయవాది లక్ష్మీకాంత్ శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ భేటీలో సీఐకి వారు శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ కృషి అభినందనీయం: సురేష్ఈ సందర్భంగా జనసేన జిల్లా నాయకులు యర్రబడి సురేష్ మాట్లాడుతూ.. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ రాత్రింబవళ్లు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య ఎప్పుడూ సత్సంబంధాలు ఉండాలని జనసేన పార్టీ బలంగా ఆకాంక్షిస్తుందని తెలిపారు. సీఐ శ్రీను నాయకత్వంలో నందిగామ పట్టణంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయనే నమ్మకం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పట్టణంలో శాంతియుత వాతావరణం పెంపొందించడం కోసం జనసేన పార్టీ ఎల్లప్పుడూ పోలీస్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరిస్తుందని ఈ సందర్భంగా సురేష్ స్పష్టం చేశారు. అనంతరం సీఐ పి. శ్రీనును జనసేన నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి, దేవుని చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో నందిగామకు చెందిన ప్రముఖ న్యాయవాది లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# జీలుగుమిల్లి భవన నిర్మాణ కార్మికులకు కీలక విజ్ఞప్తి

## జూన్ 1న లేబర్ ఆఫీసర్ రాక

**జీలుగుమిల్లి:మే 29(నేషనలిస్ట్ వాయిస్)**



ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని భవన నిర్మాణ కార్మికులందరికీ ఒక ముఖ్యమైన ప్రకటన విడుదలయింది. మార్చి 26వ తేదీ నుండి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు విస్తృతంగా అమలవుతున్న నేపథ్యంలో, జూన్ 1వ తేదీన కొవ్వూరు నుండి లేబర్ ఆఫీసర్ గారు జీలుగుమిల్లికి విచ్చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు స్థానిక రాము గారి మెడికల్ షాప్ సమీపంలో ఉన్న సిఐటియు ఆఫీసు నందు లేబర్ ఆఫీసర్ అందుబాటులో ఉంటారని మండల భవన నిర్మాణ కార్మికుల సంఘం ప్రెసిడెంట్ చిట్టిబొమ్మ కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే చేపట్టనున్న కార్యక్రమాలు:కార్డుల నవీకరణ సంక్షేమ బోర్డులో ఇప్పటికే సభ్యత్వం ఉండి, కార్డు గడువు ముగిసిన వారు తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలి. ఇప్పటివరకు సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకోని కార్మికులు, కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా ప్రస్తుతం క్రింది పథకాలు అమలవుతున్నాయని ప్రెసిడెంట్ గుర్తుచేశారు: పెళ్లి కానుక,ప్రసవ కానుక, సహజ మరణ సహాయం, మట్టి ఖర్చులు (అంత్యక్రియల సహాయం) ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందడానికి ఈ గుర్తింపు కార్డులు ఎంతో అవసరం. కావున, జీలుగుమిల్లి మండలంలోని భవన నిర్మాణ కార్మికులందరూ జూన్ 1న జరిగే ఈ కార్యక్రమానికి ససమయానికి హాజరై, ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిట్టిబొమ్మ కొండలరావు విజ్ఞప్తి చేశారు.

# మాల మహానాడు ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్మానం ....

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 29(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణానికి చెందిన మల్లేపల్లి అంజలి కి జాతీయ తెలంగాణ మాల మహానాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. వివరాలలోకి వెళ్తే కాగజ్నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియా టీచర్స్ కాలనీ కి చెందిన మల్లేపల్లి అంజలి దళిత ముద్దుబిడ్డ వరంగల్ ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీలో కార్డియాలజీ (సివిటి) కోర్సు మొదటి సంవత్సరం ఫలితాలలో కాలేజి స్థాయిలో మొదటి ర్యాంకును అదేవిధంగా రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకును సాధించినందుకు గాను కొమురం భీం జిల్లా మాల మహానాడు జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది. . అనంతరం జిల్లా అధ్యక్షులు, పరస వెంకటేష్ , ప్రధాన కార్యదర్శి తౌటి తిరుపతి మాట్లాడుతూ మన కులంలో ప్రతిభ కనబరిచిన ప్రతి విద్యార్థిని విద్యార్థులకు సంఘం తరపున గుర్తింపు ఉంటుందని అదేవిధంగా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చి కష్టపడి చదివినందుకు అభినందించారు మునుముందు రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించే విధంగా చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రెడ్డి గోపి జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి రాజు, మొగిలి వెంకటేష్ కడారి శ్రీనివాస్ ఎడ్ల శ్రీనివాస్ చిట్టి నరేష్ మాల మహానాడు యువకులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనుల మామిడి తోటల్లో గిరిజనేతరుల దౌర్జన్యం: పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు

**జీలుగుమిల్లి మే 29 (నేషనలిస్ట్ వాయిస్):**

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం జగన్నాధపురం గ్రామ రెవెన్యూ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. గిరిజన భూముల్లో ఉన్న మామిడి తోటలపై గిరిజనేతరులు దౌర్జన్యానికి దిగారు. చట్టబద్ధంగా గిరిజనుల ఆధీనంలో ఉన్న మామిడి కాయలను బలవంతంగా కోసుకెళ్లి నట్లు బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బాధితులు పోలీసులకు, ఉన్నతాధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం... జగన్నాధపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 1/2, 14/2, 15, 17, 19, 20, 21, 23, 24, 25, 26/1 లలో మొత్తం 86 ఎకరాల 68 సెంట్ల భూమి ఉంది. ఈ భూములన్నీ ఎల్టీఆర్ 1/70 చట్టం పరిధిలోకి వస్తాయి. జగన్నాధపురం, దెబ్బగూడెం, అంకన్నగూడెం గ్రామాలకు చెందిన సుమారు 100 గిరిజన కుటుంబాలు గత 30 సంవత్సరాలుగా ఈ భూముల్లో మామిడి పంటను సాగు చేసుకుంటూ, ఆ ఫలసాయాన్ని అనుభవిస్తూ జీవనం సాగిస్తున్నారు. గతంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో గిరిజనేతరుడైన వేపాక రామలింగేశ్వరరావు (రామలింగస్వామి) కి అనుకూలంగా ఎల్.పి.టి నెంబర్ 280/2021.జ, తేది: 28.04.2021 ప్రకారం సదరు భూములకు పోలీస్ ప్రొటెక్షన్ కల్పించారు. దీనిపై గిరిజనులు న్యాయపోరాటానికి దిగి గౌరవ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు, కేసు నెంబర్: 10448/2021 పరిధిలో గిరిజనులకు అనుకూలంగా తీర్పునిచ్చింది.



అయినప్పటికీ, కోర్టు ఉత్తర్వులను సైతం బేఖాతరు చేస్తూ గిరిజనేతరులు గిరిజనుల తోటల్లోకి చొరబడి దౌర్జన్యంగా మామిడి కాయలను కోసుకెళ్లడం స్థానికంగా కలకలం రేపింది. తమ నోటికాడి కూడును లాగేసుకుంటూ, దౌర్జన్యానికి పాల్పడిన గిరిజనేతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం తమ భూములకు, పంటకు రక్షణ కల్పించి, తమకు న్యాయం చేయాలని గిరిజన కుటుంబాలు ఉన్నతాధికారులను, పోలీసు యంత్రాంగాన్ని ఆశ్రయించాయి.

# రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించండి

## - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్







**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 29 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, సాధరణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరిం చే రౌడీ షీటర్ల పట్ల అణిచి వేత ధోరణీతో వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. నెల నేర సమీక్షా సమావేశం లో భాగం కిట్స్ కళాశాలలో శుక్రవారం వరంగల్ పోలీస్ కమషనర్ అధ్వర్యంలో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా శాంతి భద్రతలకు సంబంధిం చి అంశాలను ప్రస్తావిస్తూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించే రౌడీ షీటర్లకు నిర్వహించే కౌన్సిలింగ్‌లో వంద శాతం రౌడీ షీటర్లు అందరు హజర్ కావాలని. ప్రతి నెల ఒకమారు స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా రౌడీ షీటర్ల ఇండ్లను సంద ర్శించి వారిని తనఖీ చేయాలి. వారి స్థితిగతులపై ఆరా తీయాలని, తనిఖీ సమయాల్లో లేని రౌడీ షీటర్ల కదలికలపై వివరాలను సేకరించాలని. నేరాల నియంత్రణలో శాంతి భద్రతల పరి రక్షణలో భాగంగా రాత్రి సమయాల్లో బెల్ట్ షాపులను మూయించాలని, అలా చేయకుంటే వారిపై కేసులు నమోదు చేయడం లేదా బైండోర్ చేయాలని, ముఖ్యం గా నిర్ణీత సమయాల్లో షాపులను మూయించాల్సిన బాధ్యత సంబంధిత స్టేషన్ అధికారిపై వుందని రాత్రి సమయాల్లో అధికంగా రద్దీ వుండే ప్రాంతాలను గుర్తించి అక్కడ ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, ఇకపై రాత్రి సమయాల్లో ఎవరైన రోడ్లపై జన్మదిన వేడుకలు జరుపుకునే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, చోరీల కట్టడికై ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఇండ్లతో పాటు ఇతర వ్యాపార సంస్థల్లో పనులు చేసే వారి వివరాల తో పాటు హస్టల్స్ నిర్వహణ కు సంబందించిన వివరాలు సైతం స్థానిక పోలీసులు సేకరించాలని పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. అధికారుల పనితీరుపై పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేస్తూ ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి తప్పని సరిగా ఉదయం 9 గంటల నుండి ప్రజలకు అందుబాటులో వుండాలని, నేరస్థుల అరెస్టు విషయంలో అధికారులు నిర్లష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని, ద్విచక్ర వాహనాల చోరీ అయితే వెంటనే దాని పై కేసు నమోదు చేయాలని, క్షేత్ర స్థాయిలో పెట్రొలింగ్ వాహనాల పని తీరును అధికారులు సమీక్షా జరపాలని, మీ ఉద్యోగానికి మీరు న్యాయం చేస్తే ప్రజలకు న్యాయం చేసినట్లని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం పెండింగ్ కేసులు, నేరస్తుల అరెస్టు, కేసుల్లో కోనసాగుతు న్న దర్యాప్తు తీరుతెన్నులు, నేర నియంత్రణకై స్టేషన్ పరిధిలో తీసుకుంటున్న చర్యలతో పాటు, ట్రాఫిక్ సమస్యలను అధిగ మించేందుకు అధికారులు చేపట్టిన చర్యలపై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిసిపిలు అకింత్ కుమార్, దార కవిత, రాజ మహేంద్ర నాయక్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్ రావు, బాల స్వామి, సురేష్ కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను జూన్ 15నాటికి పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి






**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 29 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగ వంతంగా పూర్తి చేయడంపై తహసిల్దార్లు, బి ఎల్ వో సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఎస్ ఐ ఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు దొర్ల కుండా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో డోర్ టు డోర్ సర్వే చేసి ఎటు వంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, అవసరమైతే వివరాల నిమిత్తం పక్కనే ఉన్న కుటుంబాలను సంప్ర దించాలని పేర్కొన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు. సూపర్వైజర్లు సమన్వయం తో ప్రతిరోజు సమయం కేటాయించి ఇంటింటా సర్వే నిర్వహించాలని తెలిపారు. అధికారులు ప్రతిరోజు మానిటరింగ్ చేసి మ్యాపింగ్ ప్రక్రియ సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు పని చేయని బిఎల్‌ఓలను తొలగించి వారి స్థానంలో నూతనంగా బిఎల్‌ఓ లను నియమించాలన్నారు. జిల్లా లో 2012 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ప్రతి బూత్ లో వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, ఓటర్ల జాబితాలో డబుల్ పేర్లు ఉన్న వారి వివరాలు కూడా పూర్తి స్థాయిలో విచారించి తొలగించాలని అన్నారు. జూన్ 15 నుండి జూలై 25 వరకు నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం, దరఖాస్తుల ఫారాల పంపిణీ, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పరకాల నియోజకవర్గ పరిధిలో ఉన్న గీసుకొండ, ఖిలా వరంగల్, సంగెం మండలాలలో మ్యాపింగ్ ప్రక్రియ తక్కువగా ఉందని, అక్కడ మరింత వేగం పెంచి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధి త సూపర్వైజర్లను ఆదేశించారు. సకాలంలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయని వారిపై చర్య తీసుకోవడం జరుగుతుంద ని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, డిఆర్‌ఓ శ్రీనివాస్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్.వెంకన్న తహసీల్దార్లు, బి ఎల్ వో సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ... ఒక 'మెగా మోసం'

## - పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ధ్వజం

## - మంత్రి లోకేష్‌ను బర్తరఫ్ చేయాలని, సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐ విచారణ జరపాలని డిమాండ్

**పోలవరం, మే 29:(నేషనలిస్ట్ వాయిస్)**

కూటమి ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ ఒక పెద్ద 'మెగా మోసం, మెగా దగా, మెగా స్కాం' అని పోలవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం బాలరాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిరుద్యోగులను నమ్మించి, వారి ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటోందని ఆయన మండిపడ్డారు.

ఈ సందర్భంగా తెల్లం బాలరాజు విలేకరులతో మాట్లాడుతూ.. గత ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీపై కూటమి నాయకులు భారీ హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. "గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 6,000 పోస్టులు ప్రకటిస్తే.. వాటికి అదనంగా మరో 10,000 కలిపి మొత్తం 16,000 పోస్టులతో అధికారంలోకి వచ్చారు. దాదాపు సంవత్సరంన్నర కాలం దాటిన తర్వాత, కనీసం 50 వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇస్తారని ఆశించిన నిరుద్యోగులకు కేవలం 16 వేల పోస్టులతోనే సరిపెట్టి, దానికి 'మెగా డీఎస్సీ' అని పేరు పెట్టడం సిగ్గుచేటు" అని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుమారుడు నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన విద్యాశాఖలోనే ఈరోజు ఇంతటి భారీ అక్రమాలు బయటపడటం ఆ శాఖ లోపభూయిష్ట పనితీరుకు అద్దం పడుతోందని బాలరాజు ఆరోపించారు.

"ఒక్కొక్క అభ్యర్థి వద్ద రూ. 15 లక్షలు తీసుకుని ఉద్యోగాలు కట్టబెట్టారు. ఈ బండారం బయటపడకుండా ఉండేందుకే సెలెక్ట్ అయిన క్యాండిడేట్ల పేర్ల లిస్ట్‌ను కూడా బయటపెట్టకుండా దాచేశారు. పరీక్ష రాసిన 3 లక్షల మంది అభ్యర్థుల మార్కులను సైతం వెబ్‌సైట్ నుండి డిలీట్ చేయడం చూస్తుంటే ఇందులో ఎంతటి కుంభకోణం దాగి ఉందో అర్థమవుతోంది." అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు.

ఈ భారీ స్కామ్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గానీ, మంత్రి లోకేష్ గానీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గానీ ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. బాధిత అభ్యర్థుల తరపున వైఎస్ఆర్సిపి రాజీలేని పోరాటం చేస్తుందని బాలరాజు స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. ఇందులో భాగంగానే నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టామని, జూన్ 1వ తేదీన వైఎస్ఆర్సిపి యువజన విభాగం ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థుల కోసం మరిన్ని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. విద్యాశాఖలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్‌ను వెంటనే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి. ఈ రిక్రూట్మెంట్ ప్రక్రియ అంతా అవినీతిమయంగా మారినందున, దీనిపై హైకోర్టు సిట్టింగ్



జడ్జితో గానీ లేదా సీబీఐ తో గానీ నిష్పాక్షిక విచారణ జరిపించాలి. అలాగే అక్రమాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించి, నష్టపోయిన విద్యార్థులకు, నిరుద్యోగులకు తక్షణమే న్యాయం చేయాలి.

# గోపాలపూర్ ఊర చెరువు పూడికతీత పనులకు శంకుస్థాపన

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 29 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపూర్ ఊర చెరువులో సుమారు రూ.1 కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న పూడికతీత పనులకు వరంగల్ పార్ల మెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్థానిక శాసన సభ్యులు కె.ఆర్. నాగరాజు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సంద ర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడు తూ చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు చెరువుల నిల్వ సామర్థ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ముఖ్యంగా వర్షా కాలంలో గోపాలపూర్ పరి సర ప్రాంతాల్లో తరచూ ఎదురయ్యే వరద ముంపు సమస్యలను తగ్గించడంలో ఈ పూడికతీత పనులు కీలకంగా ఉపయోగపడ తాయని పేర్కొన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా మౌలిక సదుపాయా ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల విజయవంతా నికి ప్రజల సహకారం అవ సరమని, చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు. ఈ కార్య క్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.






# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్య క్రమాన్ని వేగవంతం చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుధర్శన్ రెడ్డి

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి






**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 29 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) ను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శ న్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నిక ల అధికారి సి.సుధర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ 2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పై రాష్ట్రం లోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్ట ర్లు, సంబంధిత అధికారుల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి వరంగల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఇతర అధికారు లు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నిక ల అధికారి సి. సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ పారదర్శక మైన ఓటరు జాబితా ప్రజా స్వామ్య వ్యవస్థకు బలమైన పునాది అని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామ ని తెలిపారు. బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమ రేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎలక్షన్ కమిష న్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసు కునే సౌకర్యం కల్పించా మని పేర్కొన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ జి. సంధ్యా రాణి, ఆర్డీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కబ్జా లేకున్నా కబ్జా గా చిత్రికరణ..

## - రాజకీయా లబ్ది కోసం కొందరు వెనుకాల ఉండి నడిపిస్తున్న వైనం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 29 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలం వేంపల్లి గ్రామంలో గతం లో 40 సంవత్సరాల క్రితం పెద్దలు మండోరే శ్యామరావు తండ్రికి అమ్మిన లావని పట్టా ను కబ్జా భూమిగా చిత్రికరణ.ఎంపీపీ ఇంటి స్థలం కు పరుశురాం కు ఎలాంటి సంబంధం లేదు.రాజకీయా లబ్ది కోసం కొందరు వెనుకాల ఉండి నడిపిస్తున్న వైనం మొన్న మహారాష్ట్ర కు చెందిన వెట్టి పరశురాం అనే వ్యక్తి వేంపల్లి లో మాజీ ఎంపీపీ ఇంటి స్థలం మరియు 5 ఎకరాల భూమి కబ్జా అని ఆరోపణలు చేయగా.. గ్రామస్తులను వివరణ కోరగా ఇది మాజీ ఎంపీపీ చాగంలాల్ కుమారుడు సాధాబైనా ద్వారా అతనికి వారసత్వం గా వచ్చిన భూమిని అమ్మిన్నాడు.అని తెలిసింది. కాగా పరుశురాం తండ్రి 40 సంవత్సరాల క్రితం మాండోర్ శ్యామరావు తండ్రి కి అమ్మగా 40 ఏండ్ల నుండి కస్తులో ఉన్నట్లు తెలుపగ పరుశురాం అతని బంధువులు కూడా రాసి ఇచ్చిన పత్రాలను చూపరని.ఇందంతా కొంత మంది వ్యక్తులు రాజకీయా ప్రతీకారం కోసం వెనుక ఉండి నడిపిస్తున్నారని.. గ్రామస్తులు వాపోయారు.ఇలాంటి బురద చల్లే ఆలోచనలు మానుకోవాలని నీతి నిజాయితీలతో ఉండాలని గ్రామస్థులు అన్నారు.



# అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్న లాడ్జి నిర్వాహకుడు అరెస్ట్

## - ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 29 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**



హనుమకొండ బస్టాండ్ కు ఎదురుగా ఉన్న అన్నపూర్ణ లాడ్జి నిర్వాహకుడు నాజర్ అనే వ్యక్తి గత కొంతకాలంగా అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని సమాచారం లభించింది. అతడు కొంతమంది మహిళ లను తన పరిచయంలో ఉంచుకొని, వారిని హన్మ కొండ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నిలబెట్టి, అక్కడ వచ్చే వ్యక్తులను ఆకర్షించేలా చేస్తున్నాడు. ఈ విధంగా ఆకర్షితులైన వ్యక్తులను తన లాడ్జికి తీసుకువచ్చి, వారి మధ్య డబ్బుల విషయమై ముందుగా ఒప్పందం జరిపించి అనంతరం లాడ్జి లో గదులు ఇచ్చి, అనైతిక కార్యకలాపాలకు అనుమతి స్తు ఆ తరువాత, కస్టమర్ నుండి మొత్తం డబ్బును తీసుకొని, అందులో కొంత భాగం మహిళలకు ఇచ్చి, మిగతా మొత్తాన్ని తన వద్దే ఉంచుకుంటున్నాడు. ఈ విధంగా నాజర్ తన లాడ్జిని ఒక అక్రమ బ్రోతల్‌గా నడుపుతూ, ప్రజా నైతికత కు విరుద్ధంగా వ్యవహరిస్తూ, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చినట్లు తెలిసింది. అతడిని శుక్రవారం అరెస్ట్ రిమాండ్ చేసినట్లు మచ్చ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ బస్ స్టాండ్ ప్రాంతం లోని ఇతర లాడ్జి నిర్వాహకులు తమ లాడ్జిల ను అనైతిక కార్యకలాపాల కు వేదికగా ఉపయోగిస్తే, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. లాడ్జిలలో బస చేసే వ్యక్తుల పూర్తి వివరాలు నమోదు చేసి సరైన గుర్తింపు పత్రాలు తీసుకోవడం, అనుమానాస్ప ద వ్యక్తులు లేదా కార్యకలా పాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం వంటి బాధ్యతలను కచ్చితంగా పాటించాలని సూచించారు. లాడ్జి ప్రాంగ ణంలో ఎలాంటి అక్రమ లేదా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన నిఘా ఉంచుతామని, నియమ నిబంధనలు ఉల్లంఘించి నట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి, లాడ్జిని సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేయడం వంటి చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.

# కళ్యాణలక్ష్మి పథకం సద్వినియోగం చేసుకోవాలి

**నిర్మల్,మే29 (నేషనలిస్ట్ వాయిస్)**

ఆడపడుచుల పెళ్లిళ్లకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా అందించే లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఆయా గ్రామాలకు చెందిన 80 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 160 దరఖాస్తులకు క్లియరెన్స్ వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో భీమేష్, స్థానిక సర్పంచ్ కందూరి సాయినాథ్, నాయకులు బోయిడి విట్టల్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారుతి, ఆయా గ్రామాల నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

# బాదేపల్లిలో పాత బజార్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాల భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డీ

జడ్చర్ల ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ ) మే 29

-80 లక్షల నిధులతో అరబిందో ఫార్మా జూ= ఆధ్వర్యంలో హరిజనవాడ పాఠశాల నిర్మాణం

-ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

-పేద విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యం

-విద్యాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాత బజార్ బాదేపల్లిలో జూ= ఫౌండేషన్ (అరబిందో ఫార్మా) వారి సౌజన్యంతో నిర్మించనున్న హరిజనవాడ ప్రాథమిక పాఠశాల భవనానికి నేడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కుష్బూ గుప్తా గారితో పాటు అరబిందో ఫార్మా ప్రతినిధులతో కలిసి జడ్చర్ల శాసనసభ్యులు శ్రీ జనంపల్లి అనిరుద్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యా ర్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పిం చేందుకు సంస్థలు ముందుకు రావడం అభినంద నీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమ న్వయంతో పనిచేస్తున్నాయని అన్నారు. హరిజన వాడలో నిర్మించనున్న ఈ నూతన పాఠశాల భవనం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అరబిందో ఫార్మా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

## ఎంపీ రఘునందన్ రావు చొరవతో లబ్ధిదారులకు రూ.1,06,500 ఆర్థిక సాయం


మనోహరాబాద్, మే 29:


ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు. మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎం. రఘునందన్ రావు చొరవతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ జిల్లా నాయకుడు నత్తి మల్లేష్ ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు బక్క వెంకటేష్ గౌడ్ కలిసి శుక్రవారం లింగారెడ్డిపేట్ గ్రామంలో లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం రూ. 1,06,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాలుగు మంది బాధితులకు పంపిణీ చేశారు. ఇందులో కమ్మరి వికాస్ చారికి రూ. 57,000, శివగోని నవీన్ గౌడ్‌కు రూ. 24,000, మన్నే మహేందర్‌కు రూ. 18,000, వర్గంటి బాలరాజ్‌కు రూ. 7,500 అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందించేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంపీ రఘునందన్ రావు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు చాపల విజయ్ ముదిరాజ్‌తో పాటు మన్నే ప్రశాంత్, వేణు గౌడ్, సతీష్, బన్నీ, కన్నయ్య, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మనము తెలంగాణలో ఉన్నామా ఆంధ్రప్రదేశ్లో ఉన్నామా ఇంకా ఆంధ్ర వాళ్ళ పెత్తనం ఈ తెలంగాణలో ఇంకెన్నాళ్లు

హైదరాబాద్ (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి)మే 29





మన తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలు పెట్టే దిక్కులేదు గాని ఇంకా ఆంధ్రా వాళ్ళ విగ్రహాలు పెడుతున్నారు అంటే మనం తెలంగాణలో ఉన్నామా ఇంకా లేక ఆంధ్రప్రదేశ్లోనే ఉన్నామా ఇంకా వీళ్ళ నిధులు నియామకాలు అని తెలంగాణ తెచ్చుకుని మరి ఇట్లానే ఉంటే మనము మన అస్తిత్వం కోల్పోతాము తెలంగాణ సంస్కృతి ఏంటి యాస ఏంటి దీని కోసమేనా మనం తెలంగాణ తెచ్చుకుని 2014లో మన జయశంకర్ సారు పోలీసు కిష్టయ్య శ్రీకాంతాచారి ఇలా వివిధ విగ్రహాలు పెట్టాలి కానీ ఎన్టీ రామారావు విగ్రహం మనకెందుకు మన జయశంకర్ సార్ విగ్రహాన్ని మనం ఆంధ్రప్రదేశ్ లో పెడితే తర్వాత వాళ్ళ రియాక్షన్ చూడండి మన వాళ్లకు తెలివి ఉందో లేదో అని అనుకుంటున్నారు ఇది ఒక మరో ఉద్యమం కి దారితీస్తుంది ఇక్కడ ప్రభుత్వం ఏమీ పని చేయట్లేదు 2014 నుంచి తెలంగాణలో మనకు ఏమి జరిగింది లేదు అందుకని ఇంకో ఉద్యమం చేసి మనం ఒక కొత్త ప్రభుత్వాన్ని నిర్మించుకొని ఒక మన సామాజిక తెలంగాణను సృష్టించుకుని అందరికీ న్యాయం చేసేలా అంటే ఎంత ఉంటే మనకు అంతా సంఖ్య పరంగా ఎమ్మెల్యేలు అని ఆ విధంగా మన అధికారాన్ని చేజిక్కించుకోవాలి మన బహుజనుడు సీఎం అయితే బాగుండు అని అనుకుంటున్నారు ఇట్లు మీ రమేష్ బహుజన ఇది 2028లో కావాలి ఇట్లు మీ రమేష్ బహుజన సుప్రీంకోర్టు అడ్వకేట్ జై తెలంగాణ జైహింద్

# 1000 డేస్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు

తూప్రాన్, మే 29. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:

ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా నిర్వహిస్తున్న 99 డేస్ కార్యక్రమాలలో ఉమెన్స్ వీక్ సందర్భంగా గురువారం తూప్రాన్ ఆరో సెంటర్‌లో “1000 డేస్ ప్రాముఖ్యత” పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీ గర్భం దాల్చిన నాటి నుండి శిశువుకు రెండు సంవత్సరాలు పూర్తయ్యే వరకు ఉన్న కాలాన్ని “తౌసండ్ డేస్”గా పేర్కొంటారని వివరించారు. ఈ కీలక సమయంలో గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రుపాల ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహారం, శిశువుల ఎదుగుదలలో మైలురాళ్లు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తల్లులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, ఏజీ గర్ల్స్ కార్యక్రమంలో పాల్గొని పలు విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వసుమతి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో కలిసి మరో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1000 డేస్ ప్రాముఖ్యతపై మహిళలకు వివరించి ఆరోగ్యకరమైన తల్లి–శిశు సంరక్షణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్, ఉప చైర్‌పర్సన్, మెప్మా సీసీలు, అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్ వసుమతి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.





# అధిక ధరల ఇసుక విక్రయాలను అరికట్టాలి...

ఏర్గట్ల, మే 29, (నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి)

ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధరకు ఇసుకను విక్రయిస్తున్నారని గ్రామ సర్పంచ్ బెజ్జరపు పావని - భానుచందర్ ఆరోపించారు. పేదల సొంతింటి కలను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు డబ్బులు దండుకుంటున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన సర్పంచ్, ఏర్గట్ల తహసీల్దార్ మల్లయ్యకు నేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధర వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. గ్రామ ప్రజలకు విజ్ఞప్తి : ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వవద్దని సర్పంచ్ పావని - భానుచందర్ ప్రజలకు సూచించారు. ఎవరైనా అధిక ధర డిమాండ్ చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.




## రైతులు సంక్షేమ పథకాలు పొందాలంటే

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

## సర్పంచ్ దేశ్ముఖ్ చంద్ర భూపాల్ రావు

(కుల్కచర్ల : నేషనలిస్ట్ వాయిస్ : మే 30)

రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, అందుకుగాను రైతులు తమ ఆధార్ కార్డును, ఆధార్ కు లింక్ అయిన మొబైల్ నెంబర్ ను తీసుకొని రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ముజాహిద్పూర్ గ్రామ సర్పంచ్ దేశ్ముఖ చంద్ర భూపాల్ రావు అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల పరిధిలోని ముజాహిద్పూర్ గ్రామంలో రైతు వేదిక నందు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతుల కొరకు ప్రత్యేకంగా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర భూపాల్ రావు మాట్లాడుతూ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే ప్రభుత్వము నుంచి వచ్చే సంక్షేమ పథకాలు పొందడానికి అర్హులు కారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ నాయక్,ప్రజా ప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.



# అదుపు తప్పి బ్రిడ్జిని ఢీకొట్టిన ట్రాక్టర్

ఏర్గట్ల, మే 29, నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి

ఏర్గట్ల మండలంలోని పెద్దవాగు వద్ద శుక్రవారం ప్రమాదం చోటుచేసుకుంది. బట్టపూర్ నుండి వెల్గటూర్ వైపు మొరం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బ్రిడ్జిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం బ్రిడ్జి నుండి జారి వాగులోకి వేలాడుతుండగా, ట్రాలీ బ్రిడ్జిపైనే చిక్కుకుపోయింది. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్, వెంటనే ట్రాక్టర్ పై నుండి దూకడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. అయితే, కింద పడటంతో అతనికి చేయి విరిగింది. స్థానికులు వెంటనే స్పందించి, క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.



# తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు

హైదరాబాద్,మే29 నేషనలిస్ట్ వాయిస్

తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ, రిజిస్ట్రేషన్ నంబర్‌ను నమోదు చేసి స్క్రీన్‌పై ఫైనల్ ర్యాంక్‌ను చూసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే కేటగిరీల వారీగా కౌన్సెలింగ్ తేదీలు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల నమోదుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రకటించనుంది. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసే వరకు విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను, హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించి అప్‌డేట్ల కోసం విద్యార్థులు నిరంతరం అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా కోరారు.




# గుజరాత్ బౌలర్లకు ప్యాట్ కమిన్స్ విలువైన సలహా

అందరి కళ్ళు రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పైనే ఉన్నాయి. అతని విధ్వంసకర బ్యాటింగ్‌ను అడ్డుకోవడానికి గుజరాత్ బౌలర్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఒక విలువైన సలహాను అందించాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ ఫామ్ చూస్తుంటే ఏ బౌలర్‌కైనా చెమటలు పట్టడం ఖాయం. బౌలర్ల నామరూపాలు లేకుండా చేస్తూ మైదానంలో అతను సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్‌ను ముక్కలు ముక్కలు చేసిన వైభవ్, ఇప్పుడు అదే ముల్లాన్‌పూర్ పిచ్‌పై గుజరాత్‌తో తలపడనున్నాడు. దీంతో గుజరాత్ బౌలింగ్ విభాగం అతడిని ఎలా అవుట్ చేయాలనే దానిపై తీవ్రంగా బుర్ర బద్దలు కొట్టుకుంటోంది. ఏ చిన్న తప్పు చేసినా మ్యాచ్ చేజారిపోతుందనే భయం గుజరాత్ క్యాంప్‌లో స్పష్టంగా కనిపిస్తోంది.ప్రపంచ స్థాయి బౌలర్, సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సైతం వైభవ్ సూర్యవంశీ దెబ్బకు తల్లడిల్లిపోయాడు. ఎలిమినేటర్ పోరులో బంతిని ఎక్కడ వేసినా సరే, వైభవ్ దాన్ని స్టాండ్స్‌లోకి పంపించడమే పనిగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే సీనియర్ బౌలర్ అయిన కమిన్స్ తన 4 ఓవర్ల కోటాలో ఏకంగా 64 పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. వైభవ్ బ్యాటింగ్ ధాటికి కమిన్స్ ఎంతగా అల్లాడిపోయాడో ఈ గణాంకాలే చెబుతున్నాయి. "వైభవ్ సూర్యవంశీకి వేరే ఎక్కడ బంతి వేసినా వృథానే. అతడిని కట్టడి చేయాలంటే యార్కర్లు, స్లో బంతులు మాత్రమే ఏకైక మార్గం." అని ఎలిమినేటర్ ఓటమి అనంతరం ప్యాట్ కమిన్స్ వ్యాఖ్యానించాడు. తాను అనుభవించిన పరాభవాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈరోజు జరగబోయే క్వాలిఫయర్ 2 మ్యాచ్ కోసం గుజరాత్ బౌలర్లకు కమిన్స్ ఒక కీలకమైన రహస్యాన్ని చెప్పాడు. ముల్లాన్‌పూర్ పిచ్‌పై వైభవ్‌ను ఎదుర్కోవాలంటే కేవలం ఖచ్చితమైన యార్కర్లు, చాకచక్యమైన స్లోయర్ బంతులు మాత్రమే ఉపయోగపడతాయని తెలిపాడు.



# ఇటలీ టెన్నిస్ స్టార్ జనిక్ సినర్?కు భారీ షాక్ రెండో రౌండ్?లోనే ఓడిపోయి ఇంటిబాట

2026 ఫ్రెంచ్ ఓపెన్?లో ఇటలీ టెన్నిస్ స్టార్ జనిక్ సినర్?కు భారీ షాక్ తగిలింది. అతడు రెండో రౌండ్?లోనే ఓడిపోయి ఇంటిబాట పట్టాడు. అగ్రశ్రేణి ఆటగాడు జనిక్ సినర్?ను 56వ ర్యాంకర్ జువాన్ మాన్యువల్ సెరుండోలో (అర్జెంటీనా) ఓడించి భారీ షాకిచ్చాడు. అతడు 3-6, 2-6, 7-5, 6-1, 6-1 తేడాతో ఇటలీ స్టార్?ను ఓడించి కెరీర్?లో చరిత్రాత్మక విజయం అందుకున్నాడు.అయితే ఈ మ్యాచ్?లో తొలి రెండు సెట్లలో సినర్?దే ఆధిపత్యం. ఆరంభం నుంచే అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించిన సినర్, మొదటి సెట్?ను 6-3, రెండో సెట్?ను 6-2 స్కోర్లతో కైవసం చేసుకుని పోటీలో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించాడు. అయితే మైదానంలో ఎండ వేడి, కండరాల గాయాలు సినర్?ను పూర్తిగా దెబ్బ కొట్టాయి. ఎండ వేడికి అతడు తట్టుకోలేకపోయాడు. అప్పుడే కండరాల నొప్పి కూడా ఎటాక్ చేయడంతో సినర్? ఆటపై దాని ఎఫెక్ట్ పడింది. ఈ అవకాశాన్ని ప్రత్యర్థి సెరుండోలో పూర్తిగా సద్వినియోగం చేసుకొని దూడుకుడా ఆడాడు. దీంతో ఆ తర్వాత వరుసగా మూడు సెట్లలో సినర్?ను ఓడించాడు.అయితే సినర్? ఓటమిపై క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ స్పందించాడు. అథ్లెట్లకు ఫిట్?నెస్ ఎంత ముఖ్యమో తెలుపుతూ ఎక్స్?లో రాసుకొచ్చాడు. "మనసు ముందుకు వెళ్లాలని కోరుకున్న సమయంలో, శరీరం సహకరించకపోతే ఆటలో నిస్సహాయులం అవుతాం. ఈ రోజు సినర్‌ను చూసి నేను జాలిపడ్డాను. ఎందుకంటే, ఇలాంటి పరిస్థితి ఎదురవ్వడం చాలా బాధాకరం. ఒక ఛాంపియన్ నిజమైన సత్తా ఎల్లప్పుడూ కమ్?బ్యాక్ ఇవ్వడంలోనే ఉంటుందని గుర్తుంచుకోండి. అందుకే క్రీడలు ఎప్పుడూ అనూహ్యంగా, ప్రత్యేకంగా ఉంటాయి. ఈ మ్యాచ్?లో జువాన్ మాన్యుయెల్ సెరుండోలో చివరి వరకు సంయమనం పాటిస్తూ, నమ్మకంతో ఉన్నాడు. తనకు లభించిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని ఆటలో విజయం సాధించాడు. అతడికి నా అభినందనలు" అని సచిన్ పేర్కొన్నాడు.కాగా, రీసెంట్?గా సినర్ ఇటాలియన్ ఓపెన్ టైటిల్?ను కైవసం చేసుకొని అరుదైన ఘనత సాధించాడు. గత 50 ఏళ్లలో ఇటాలియన్ ఓపెన్ గెలిచిన తొలి ఇటలీ పురుష ఆటగాడిగా సినర్ రికార్డు కొట్టాడు. ఆ జోష్?లో ఫ్రెంచ్? ఓపెన్?లో బరిలోకి దిగిన అతడు తొలి రౌండ్?లో టబుర్?పై 6-1, 6-3, 6-4 తేడాతో ఈజీగా నెగ్గి రెండో రౌండ్?కు అర్హత సాధించాడు. ఇక్కడా సునాయసంగానే నెగ్గేస్తాడని ఫ్యాన్స్ భావించగా అతడికి సెరుండోలో షాకిచ్చాడు.



# సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న పంత్

లక్నో సూపర్ జెయింట్స్ సంచలన ప్రకటన చేసింది. తమ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించింది. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తికాక ముందే ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఈ సీజన్‌లో లక్నో జట్టు పంత్ నాయకత్వంలో ఆడిన 14 మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో కెప్టెన్సీ బాధ్యతల నుంచి తనను తప్పించాల్సిందిగా పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంచైజీ అంగీకరిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది.లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ పూర్తిగా ముగియకముందే.. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. ఈ విషయాన్ని ఆ ఫ్రాంఛైజీ అధికారికంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఐపీఎల్ 2026లో పంత్ సారథ్యంలోని లక్నో సూపర్ జెయింట్స్ దారుణ ప్రదర్శన చేసింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగున పడిపోయింది. ఈ నేపథ్యంలో పంత్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు."లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని రిషభ్ పంత్ చేసిన అభ్యర్థనను ఫ్రాంచైజీ అంగీకరించింది. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అంత ఈజీ కాదు. కెప్టెన్‌గా రిషభ్ పంత్ ఇప్పటివరకు ఫ్రాంఛైజీకి గొప్పగా సేవలందించాడు" అని లక్నో సూపర్ జెయింట్స్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. వచ్చే సీజన్‌కు ముందు టీమ్‌ను పునర్నిర్మించడంపై తాము ఫోకస్ పెట్టినట్లు వెల్లడించింది.కాగా ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున కెరీర్ ఆరంభించిన రిషభ్ ఫంత్.. ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు అనూహ్యంగా ఆ జట్టును వీడాడు. దీంతో ఐపీఎల్ 2025 మెగా వేలంలోకి వచ్చేశాడు. ఇతర జట్లతో పోటీ పడి మరి లక్నో సూపర్ జెయింట్స్.. రికార్డు ధర రూ.27 కోట్లు వెచ్చించి.. పంత్‌ను దక్కించుకుంది. వెంటనే కెప్టెన్‌ను చేసింది. అయితే కెప్టెన్‌గా, ఆటగాడిగా పంత్ పూర్తిగా విఫలమయ్యాడు.లక్నో సూపర్ జెయింట్స్ రిషభ్ పంత్ సారథ్యంలో గత సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్ చేరకుండానే నిష్క్రమించింది.




# స్మృతి మంధాన గోల్డెన్ డకౌట్

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత మహిళా జట్టు ఓపెనర్ స్మృతి మంధాన ఓ చెత్త రికార్డు నెలకొల్పింది. ఈ మ్యాచ్‌లో స్మృతి ఇన్నింగ్స్ తొలి బంతికే డకౌట్ అయింది. ఇప్పటి వరకు టీమిండియా తరఫున ఇన్నింగ్స్ తొలి బంతికే ఎవ్వరూ డకౌట్ కాలేదు.. ఈ చెత్త రికార్డు అందుకున్న తొలి బ్యాటర్‌గా స్మృతి మంధాన నిలిచింది. ఈ మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్, యస్తికా భాటియా రాణించడంతో భారత్ భారీ స్కోర్ చేసి 38 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది.ఐసీసీ మహిళల టీ 20 వరల్డ్‌కప్ ముందు టీమిండియా ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ఆడుతోంది. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా చెమ్స్‌ఫోర్డ్‌లో గురువారం తొలి మ్యాచ్ జరగింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా టెంపరరీ కెప్టెన్ స్మృతి మంధాన ఓ చెత్త రికార్డు నెలకొల్పింది.టీమిండియా ఇన్నింగ్స్ ఆరంభించిన స్మృతి మంధాన తొలి బంతికే అవుటయింది. ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్ వేసిన బంతిని డిఫెండ్ చేయగా అది చార్లీ డీన్ చేతుల్లోకి వెళ్లింది. దాంతో స్మృతి మంధాన మొదటి బంతికే డకౌట్ అయింది. టీమిండియా ఉమెన్స్ టీ20 చరిత్రలో మొదటి బంతికే డకౌట్ అయిన తొలి బ్యాటర్‌గా చెత్త రికార్డును మూటగట్టుకుంది. టీ20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో భారత మహిళల తరఫున అత్యధిక పరుగులు చేసిన స్మృతి మంధానకు ఇది ఆరో డకౌట్. టీమిండియా ఉమెన్స్ జట్టులో టీ20ల్లో అత్యధిక డకౌట్స్ అయిన ప్లేయర్‌గా మాత్రం షెఫాలీ వర్మ ముందు వరుసలో ఉంది.



# మ్యాచ్ రూపురేఖలను మార్చేయగల టాప్ ఆటగాళ్లు

ఐపీఎల్ 2026 రెండో క్వాలిఫైయర్‌లో శుక్రవారం రాత్రి గుజరాత్ టైటాన్స్ , రాజస్థాన్ రాయల్స్ తలపడనున్నాయి. మొదటి క్వాలిఫైయర్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ ఓటమిని చవిచూసింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ను రాజస్తాన్ జట్టు ఓడించింది. రెండో క్వాలిఫైయర్‌లో ఒంటిచేత్తో మ్యాచ్ రూపురేఖలను మార్చేయగల టాప్ 5 ఆటగాళ్ల ఉన్నారు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిపించి మెరుపు ఇన్నింగ్స్ ఆడి రాజస్థాన్ రాయల్స్‌కు రెండో క్వాలిఫైయర్ టికెట్ అందించాడు వైభవ్ సూర్యవంశీ. ఈ మ్యాచ్‌లోనూ 15 ఏళ్ల టీనేజర్ ఆర్ఆర్‌కు కీలకం కానున్నాడు. అతడు కనుక మరోసారి చెలరేగితే ప్రత్యర్థి గుజరాత్ జట్టుకు ఓటమి తప్పదు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 29 బంతుల్లోనే 97 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఆ బంతికి సెంచరీ చేసింటే ఐపీఎల్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా రికార్డు నమోదయ్యేది. రాజస్థాన్ రాయల్స్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ గత కొన్ని మ్యాచ్‌లుగా బంతితో అద్భుతం చేస్తున్నాడు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో కూడా సన్‌రైజర్స్ మీద ఆర్చర్ అద్భుతంగా బౌలింగ్ చేసి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్లో 15 మ్యాచ్‌ల్లో జోఫ్రా ఆర్చర్ 24 వికెట్లు పడగొట్టాడు. పవర్‌ప్లే, చివరి డెత్ ఓవర్లలో పేసర్ ఆర్చర్ గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కూడా ఈ సీజన్ బాగా కలిసొచ్చింది. కెప్టెన్‌గానూ మరోవైపు బ్యాటర్‌గానూ నిలకడగా రానిస్తున్నాడు. 14 మ్యాచ్‌ల్లో గిల్ 159 స్ట్రైక్ రేట్‌తో 618 పరుగులు చేశాడు. గిల్, సాయి సుదర్శన్‌తో కలిసి ఈ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు పలు కీలక మ్యాచ్‌ల్లో విజయాన్ని అందించాడు. రెండో క్వాలిఫైయర్ మ్యాచులో గనుక సుదర్శన్, గిల్ జోడి మరోసారి రాణిస్తే, రాజస్థాన్ రాయల్స్‌కు చిక్కులు తప్పవు.



# వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతి

ఏషియన్ గేమ్స్ ట్రయల్స్‌లో పోటీపడే అంశంలో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నెల జరగనున్న ఆసియా గేమ్స్ ఎంపిక పోటీలలో (సెలక్షన్ ట్రయల్స్) పాల్గొనేందుకు స్టార్ రెజ్లర్ వినేష్ ఫొగాట్‌కు అనుమతి ఇచ్చింది. ఇంతకు ముందు వినేశ్ ఫొగాట్? ఆసియా గేమ్స్ 2026 సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనవచ్చంటూ దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ భారత రెజ్లింగ్ సమాఖ్య సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తన పరిధిని మీరిందని, ఎంపిక ప్రమాణాల ప్రకారం వినేశ్ అనర్హురాలని పేర్కొంది. అయితే డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌ను విచారించిన సుప్రీం దిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ స్థానంలో వేరొకరు ఉండి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదని, కానీ వినేశ్ ఈ దేశాన్ని గర్వపడేలా చేశారని వెల్లడించింది. ఇప్పటికే ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు హైకోర్టు అనుమతి ఇచ్చిందన్న అత్యున్నత న్యాయస్థానం ఈ దశలో వినేశ్‌ను వెనక్కి వెళ్లమని చెప్పడం సరికాదని వ్యాఖ్యానించింది. ప్రస్తుతానికి ఈ విషయంలో తాము ఏం చేయలేమని ఆమె పోటీల్లో పాల్గొనవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఐతే డబ్ల్యూఎఫ్ఐ పిటిషన్‌పై వినేశ్‌కు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి అంశాలకు పరిష్కారం కోర్టుల్లో కాకుండా వ్యవస్థల్లోనే ఉండాలని అభిప్రాయపడింది. క్రీడాకారులు, అధికారులు, సంస్థల మధ్య సమన్వయం బలంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించింది. "ఇలాంటి విషయాల్లో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. అలాంటి సమయంలో కోర్టులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. సమతుల్యత పాటిస్తూ కఠిన నిర్ణయాలు తీసుకోవాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జస్టిస్ నరసింహ మాట్లాడుతూ, "హైకోర్టు ఇప్పటికే అనుమతి ఇచ్చిన తర్వాత వినేశ్‌లో ఆశలు, అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆమెను ఇంటికి వెళ్లిపోమని చెప్పడం సరైంది కాదు" అని వ్యాఖ్యానించారు.

# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక





సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసంద్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, ఆ విషయంలో దర్శకుడు పాత పద్ధతుల్నే అనుసరించినట్టు ఈ సినిమా రుజువు చేస్తుంది. ఎ÷-లాష్‌బ్యాక్‌లో వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసేవరకూ కథ ఊపందుకోదు. అప్పటివరకూ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచకుండా అలా సాగుతూనే ఉంటాయి. హాస్యం, ప్రేమకథల్లోని సంఘర్షణ, కెమిస్ట్రీ తెరపై కనిపించవు. విరామ సన్నివేశాల నుంచే సినిమా కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసలేది నిజమనే ఉత్సుకత రేకెత్తిస్తుంది. దర్శకుడు లాజిక్స్ గురించి పట్టించుకోనేలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వ్యక్తులు ఏ కథ చెబితే అది పోలీసులు విని అక్కడిక్కడికే కేసుపై ఓ నిర్ణయానికొచ్చేస్తుంటారు. ఆ కేసులో ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని కనీసం ఆరా తీయడం కానీ, వివరాలు తెలుసుకోవడం కానీ కనిపించదు. దాంతో తెరపై జరిగే తతంగం అంతా నాటకీయంగానే అనిపిస్తుంది . మొత్తంగా ఈ కథలో థ్రిల్ ఉంది కానీ, తెరపైకి దాన్ని ఇంకాస్త బలంగా చూపించివుంటే బాగుండేది.




# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు

అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.

# దేవిశ్రీతో ప్రయాణం ముగిసినట్లేనా?



టాలీవుడ్ దర్శకుడు సుకుమార్- సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్య'తో మొదలైన వీరి ప్రయాణం 'రంగస్థలం', 'పుష్ప' వంటి ఇండస్ట్రీ హిట్స్ వరకు చేరి తెలుగు సినీ పరిశ్రమలో ఓ ప్రత్యేకమైన ముద్ర వేసింది. సుకుమార్ సినిమాలకు దేవిశ్రీ ఇచ్చిన సంగీతం అనేక సందర్భాల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచింది. అందుకే ఈ కాంబోకు అభిమానుల్లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పటివరకు తన సినీ కెరీర్‌లో సుకుమార్ పూర్తి స్థాయిలో దేవిశ్రీ ప్రసాద్‌తోనే ప్రయాణించడం విశేషం. వీరిద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, కథను సంగీతంతో మరింత ఎమోషనల్‌గా ఎలివేట్ చేసే తీరు ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంది. అయితే ఇటీవల కాలంలో ఈ క్రేజీ కాంబినేషన్‌కు బ్రేక్ పడే అవకాశాలున్నాయంటూ ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 'పుష్ప-2' నిర్మాణ సమయంలో ఇద్దరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు దేవిశ్రీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో సుకుమార్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే కొన్ని భాగాలకు ఇతర సంగీత దర్శకుల సహాయం తీసుకున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. ఈ పరిణామం దేవిశ్రీ ప్రసాద్‌ను అసంతృప్తికి గురిచేసిందని, ఆ బాధను ఆయన ఓ ఈవెంట్‌లో పరోక్షంగా వ్యక్తం చేశారనే చర్చ కూడా జరిగింది. ఇప్పుడు అదే చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సుకుమార్ తెరకెక్కించబోయే తదుపరి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త సంగీత దర్శకుడిని తీసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' సినిమాతో హీరోగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతుండటం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. అంతేకాదు, పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రానికి దేవిశ్రీ పూర్తి స్థాయిలో సంగీతం అందించలేకపోయారని, అందుకే ఆ బాధ్యతలను థమన్‌కు అప్పగించారనే ప్రచారం కూడా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ఒకప్పుడు వరుసగా దేవిశ్రీతో పనిచేసిన పలువురు స్టార్ దర్శకులు ఇప్పుడు ఇతర సంగీత దర్శకుల వైపు మొగ్గు చూపుతుండటంతో.. సుకుమార్ కూడా అదే దారిలో వెళ్తారా అనే ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ఇంకా స్క్రిప్ట్ దశలోనే ఉందని సమాచారం. కథ పూర్తిగా సిద్ధం కాకముందే సంగీత దర్శకుడిని ఫైనల్ చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది.

# జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా




తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.




# పెద్దిపై అసత్య ప్రచారం ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు

'పెద్ది'పై అసత్య ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరిపై కేసు నమోదైనట్లు సమాచారం. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా విషయంలో టీమ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తాజాగా దీనిపై ఆన్‌లైన్ వేదికగా అసత్య ప్రచారం చేస్తోన్న ఇద్దరి వ్యక్తులను గుర్తించి వారిపై ఫిర్యాదు చేసింది. గుంటూరు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు 'పెద్ది'పై ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో నెగెటివిటీ క్రియేట్ చేస్తున్నట్లు టీమ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆధారాలను సేకరించిన చిత్రబృందం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే చిత్ర నిర్మాతలు ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్న విషయం తెలిసిందే. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు వెకేషన్ బెంచ్ తాజాగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన సన్నివేశాలు, పాటలు ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. దీంతో ముందస్తు లీక్‌లు కాకుండా చర్యలు చేపట్టినట్లు అయింది. ఇప్పుడు ఇలా సోషల్ మీడియాలోనూ చిత్రబృందం యాక్టివ్‌గా ఉంటూ నిశితంగా పరిశీలించి నెగెటివిటీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656